http://www.agnidharanews.com

# అగ్నిధార

సోమవారం 23 మార్చి 2026

పేజీలు : 5    వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



## మోదీ రికార్డు

తన రాజకీయ జీవితంలో ప్రధాని మోదీ మరో అరుదైన మైలురాయిని చేరుకున్నారు. 8,931 రోజుల పాటు (గుజరాత్ సీఎం పదవీకాలం సహా) ఎలాంటి విరామం లేకుండా దేశంలో సుదీర్ఘకాలం ప్రభుత్వ అధిపతిగా పనిచేసిన వ్యక్తిగా నిలిచారు. ఇప్పటి వరకు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న ఈ రికార్డును మోదీ అధిగమించారు. చామ్లింగ్ సిక్కిం ప్రభుత్వ అధిపతి (ముఖ్యమంత్రి)గా 8,930 రోజులు పనిచేశారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ 2014లో ప్రధానమంత్రి అయ్యే వరకు ఆ పదవిలో ఉన్నారు. అప్పటినుంచి నేటి వరకు ప్రధానిగా కొనసాగుతున్నారు.

- మోదీ సరికొత్త రికార్డు..
- ప్రభుత్వాధినేతగా 8,931 రోజులు పూర్తి
- అటు సీఎంగా, ఇటు ప్రధానిగా మోదీ ఈ ఘనత దక్కించుకున్నాడు.
- 24 ఏళ్లకు పైగా రాజ్యాంగ బద్ధమైన ప్రభుత్వాధినేతగా, అది కూడా మధ్యలో ఎలాంటి విరామం లేకుండా కొనసాగి మోదీ రికార్డు నెలకొల్పాడు
- ప్రధాని మోదీ తొలిసారిగా 2001లో గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు

## రీజినల్ రింగ్ రోడ్డు కాస్త హైవేగా మార్పు!



- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ట్రిపుల్ఆర్ డిజైన్‌లో భారీ మార్పులు
- భారీ వ్యయం వల్ల ట్రిపుల్ఆర్ ప్రత్యేకతలను తొలగించి సాధారణ హైవేగా మార్పు
- తొలుత దేశంలోనే 8 లైన్లతో కూడిన అతి పొడవైన రింగ్ రోడ్డుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన



మమత కంచుకోట..

## ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా!

- ఈ క్రమంలోనే భవానీపూర్ నియోజకవర్గం అందరి దృష్టి ఆకర్షిస్తోంది
- స్వాతంత్ర్యం అనంతరం దశాబ్దాలపాటు ఇక్కడ హస్తం పార్టీ నేతలదే పైచేయి.
- బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి సిద్దార్థ శంకర్ రే.. భవానీపూర్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు.

## పంటల విధానంలో మరిన్ని మార్పులు

- పంటల మార్పిడి చేస్తే బోనస్
- రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం
- రైతు భరోసా కింద 1.50 కోట్ల ఎకరాలకు సాయం
- రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధుల విడుదల
- తొలి విడతగా రూ.3,590 కోట్లు అన్నదాతల ఖాతాల్లో నిధులు జమ చేయనున్న ప్రభుత్వం



హైదరాబాద్

రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుతు తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రారంభించింది. దీనికి సంబంధించిన నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఈ పథకం కింద 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందించనున్నారు. దీనికోసం రూ.9 వేల కోట్లను ప్రభుత్వం సమకూర్చుకుంది. సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆదివారం జరిగిన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రుల సమక్షంలో సీఎం ఈ నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ముఖ్యమంత్రి, ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నా రైతుల విషయంలో వెనకంజ వేయటం లేదని పేర్కొన్నారు. ఆర్థిక సమస్యలు అభివృద్ధికి అవరోధంగా - మిగతా3లో

## ఓటర్లకు ఆ సౌకర్యాలు ఉండాలి

- అసెంబ్లీ ఎన్నికల వేళ ఈసీ కీలక ప్రకటన
- ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు
- ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల
- అవగాహన కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఒకే రకమైన నాలుగు ఓటరు సౌకర్యాల పోస్టర్‌లను ప్రదర్శించాలి



## జైళ్లలో రద్దీపై సుప్రీంకోర్టు ఆందోళన

- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు
- జైళ్లలో రద్దీ ఎక్కువగా ఉండటంపై సుప్రీం కోర్టు ఆందోళన
- జైళ్లలో రద్దీ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై నివేదిక ఇవ్వాలన్న సుప్రీంకోర్టు
- అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

## ఇళ్ల పంపిణీలో అక్రమాలు

- మీకు ఇందిరమ్మ ఇల్లు వచ్చిందిగా – రూ.5 వేలు కట్టండి
- లేదంటే మీ పేరు తొలగిస్తాం' : లబ్ధిదారులకు ఫోన్? కాల్స్
- ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం రూ.5,000 డిమాండ్ చేసిన మహిళ
- నగదు ఇవ్వకుంటే జాబితాలో మీ పేరు ఉండదంటూ హుకుం జారీ ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని వారి కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండాలని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. కానీ కొన్నిచోట్ల ఇళ్ల పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరికొందరు మాత్రం పేద ప్రజల నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనే హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. "హలో మీకు ఇందిరమ్మ ఇల్లు వచ్చింది కదా దీనికి మీరు రూ.5,000 చెల్లించకపోతే ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో నుంచి మీ పేరు తొలగిస్తారు" అంటూ ఓ మహిళ నుంచి సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఓ పేద మహిళకు ఫోన్ చేశారు. - మిగతా3లో





## ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను కాపాడుతాం

- ఈయూ పిలవగానే వెళ్లడానికి మేం రెడీ : ఇరాన్
- ఈయూ పిలిస్తే, గ్రీన్‌లాండ్‌ను కాపాడేందుకు వెళ్తాం
- గ్రీన్‌లాండ్‌ను కాపాడుకోలేని పరిస్థితి వస్తే, మమ్మల్ని పిలవండి
- డియాగో గార్షియాపై మిస్సైల్ ఎటాక్‌తో మాకు సంబంధం లేదు
- ఇరాన్ సైన్యం కీలక ప్రకటన

# ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను కాపాడుతాం

అమెరికాతో యుద్ధం వేళ డెన్మార్క్‌లోని గ్రీన్‌లాండ్ ద్వీపంపై ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను రక్షించేందుకు తాము సిద్ధమని ఇరాన్ వెల్లడించింది. ఒకవేళ యూరోపియన్ యూనియన్ (ఈయూ) పిలిస్తే, వెంటనే గ్రీన్‌లాండ్‌ను రక్షించడానికి వెళ్తామని తెలిపింది. తాజాగా ఇరాన్ సైన్యం అధికార ప్రతినిధి ఈ వ్యాఖ్యలు చేశారు.

**గ్రీన్‌లాండ్‌ను కాపాడేందుకు మేం వస్తాం : ఇరాన్**

"గ్రీన్‌లాండ్ ద్వీపాన్ని అమెరికాకు ఇచ్చేయాలని తొలుత ఈయూను ట్రంప్ బెదిరించారు. అనంతరం అదే ఈయూతో ట్రంప్ ప్రాధేయపడ్డారు. ఇరాన్‌పై యుద్ధంలో అమెరికాకు ఈయూ సైనిక సాయం చేయకుంటే, గ్రీన్‌లాండ్‌ను లాక్కుంటామని ఇప్పుడు మళ్లీ ట్రంప్ బెదిరిస్తున్నారు. ఒకవేళ గ్రీన్‌లాండ్‌ను కాపాడుకోలేని పరిస్థితిలో ఈయూ ఉంటే, ఇరాన్‌ను పిలవండి. గ్రీన్‌లాండ్‌ను కాపాడేందుకు మాదేశం వస్తుంది" అని ఇరాన్ సైన్యం అధికార ప్రతినిధి వెల్లడించారు.

**డియాగో గార్షియాపై మిస్సైల్ ఎటాక్ : తమకు సంబంధం లేదన్న ఇరాన్**

హిందూ మహాసముద్రంలోని డియాగో గార్షియా ద్వీపంలో ఉన్న బ్రిటన్ సైనిక స్థావరంపై జరిగిన మిస్సైల్ దాడిలో తమ పాత్ర లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇరాన్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి ఈ విషయాన్ని చెప్పారంటూ అల్ జజీరా ఆదివారం రోజు ఒక కథనాన్ని ప్రసారం చేసింది. వ్యూహాత్మకమైన డియాగో గార్షియా ద్వీపంలో ఉన్న సైనిక స్థావరాన్ని అమెరికా, యూకే సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని అమెరికా సైనిక ఆపరేషన్లకు ఇది కీలకమైంది. ఈ ద్వీపంలోని చాగోస్ ఆర్కిపెలాగో అనే పగడపు దిబ్బలో ఉన్న సైనిక స్థావరంపై రెండు ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ మిస్సైళ్ల(ఐసీబీఎం)తో



ఇరాన్ దాడి చేసిందంటూ అమెరికా మీడియా సంస్థ వాల్ స్ట్రీట్ జర్నల్ కథనాన్ని ప్రచురించింది. వీటిలో ఒక మిస్సైల్ గాల్లోనే ఫెయిల్ కాగా, మరొకదాన్ని గగనతల రక్షణ వ్యవస్థ కూల్చేసిందని పేర్కొంది. అయితే ఏ తేదీన ఈ దాడి జరిగిందనే సమాచారాన్ని ఈ కథనంలో ప్రస్తావించలేదు.

**ఇరాన్ మిస్సైళ్ల రేంజ్ 2వేల కిలోమీటర్లే**

ఇరాన్‌కు దాదాపు 4వేల కిలోమీటర్ల దూరంలో డియాగో గార్షియా ద్వీపం ఉంది. అంత దూరంలోని లక్ష్యాలను ఛేదించగలిగే మిస్సైళ్లు తమ దగ్గర లేవని ఇరాన్ మొదటినుంచీ చెబుతోంది. 2వేల కిలోమీటర్లకు మించిన రేంజ్ కలిగిన క్షిపణులు తమ దగ్గర లేవని గత నెలలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి తెలిపారు.

**ఇరాన్ ఈ ప్రపంచానికే పెనుముప్పు : ఇజ్రాయెల్**

డియాగో గార్షియాపై వాల్ స్ట్రీట్ జర్నల్ కథనాన్ని హైలైట్ చేస్తూ ఇజ్రాయెల్ ఆర్మీ (ఐడీఎఫ్) ఒక ట్వీట్ చేసింది. ఇరాన్ దగ్గర 4వేల కిలోమీటర్ల రేంజ్ కలిగిన మిస్సైళ్లు ఉండటం అనేది ఐరోపా, ఆసియా, ఆఫ్రికాలోని డజన్ల కొద్దీ దేశాలకు పెనుముప్పు అని ఐడీఎఫ్ తెలిపింది. లాంగ్ రేంజ్ మిస్సైళ్లను తయారుచేయడంపై ఇరాన్‌కు ఆసక్తి ఉందనేది దీనితో తేటతెల్లం అవుతోందని ఆరోపించింది. యావత్ ప్రపంచానికే ముప్పులా ఇరాన్ తయారైందని ఐడీఎఫ్ మండిపడింది. ఇప్పుడు ఇరాన్ మిస్సైళ్లు లండన్, ప్యారిస్, బెర్లిన్ వంటి నగరాలకు చేరుకోగలవని పేర్కొంది.

**వరుసగా నాలుగోవారం ఇరాన్‌లో ఇంటర్నెట్ బ్లాకౌట్**

ఇరాన్‌లో ఇంటర్నెట్ సేవల నిలిపివేత వరుసగా నాలుగోవారం కూడా కొనసాగుతోంది. దాదాపు గత 500 గంటలుగా ఆ దేశంలోని ప్రజలకు ఇంటర్నెట్ కనెక్టివిటీ లేదు. అమెరికా–ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో ఇంటర్నెట్ సేవలను ఇరాన్ ప్రభుత్వం నిలిపివేసింది. దీనివల్ల ఇరాన్ ప్రజలు కనీసం పరస్పర కమ్యూనికేషన్ చేసుకోలేకపోతున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ అంశం అక్కడి జన జీవితాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందని పరిశీలకులు అంటున్నారు.

దేశ ప్రజలు ఇంటర్నెట్‌ను పొందే ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ఇరాన్ నిలిపివేసిందని సైబర్ మానిటరింగ్ సంస్థ నెట్‌బ్లాక్స్ తెలిపింది. శాటిలైట్ కనెక్షన్లు, వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్‌ల(వీపీఎన్)తోనూ ఇరానీయులు ఇంటర్నెట్‌ను పొందలేకపోతున్నారని పేర్కొంది. ప్రస్తుత యుద్ధ పరిస్థితుల్లో ఇరానీయులు కుటుంబీకులు, బంధువుల యోగక్షేమాలను తెలుసుకునే ఏకైక మార్గం కూడా మూసుకుపోయిందని నెట్‌బ్లాక్స్ వెల్లడించింది. ప్రజా భద్రత, సమన్వయం, భావోద్వేగ మద్దతుకు ఇంటర్నెట్ కమ్యూనికేషన్ అనేది కీలకమని తెలిపింది. ఇంటర్నెట్ సర్వీసులు లేక ఇక్కట్లు పడుతున్నామని ఇరానీయులు చెప్పారంటూ అల్ జజీరాలో కథనాలు ప్రసారమయ్యాయి. పశ్చిమాసియా యుద్ధం తీవ్రరూపు దాలుస్తున్న ప్రస్తుత తరుణంలో, ఇంటర్నెట్ సేవల పునరుద్ధరణపై ఇరాన్ ఇప్పటిదాకా ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు.

# ఓటర్లకు ఆ సౌకర్యాలు ఉండాలి

అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, బంగాల్ శాసనసభ ఎన్నికలతో పాటు మరో ఆరు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ రోజున మొత్తం 2,18,807 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల కమిషనర్లకు (సీఈఓలకు) సూచించింది. ఈ మేరకు పత్రికా ప్రకటన రిలీజ్ చేసింది. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఓటర్లు వేచి ఉండేందుకు ప్రదేశం, మరుగుదొడ్డి, తగినంత లైటింగ్, దివ్యాంగుల కోసం సరైన వాలుతో కూడిన ర్యాంప్, స్టాండర్డ్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్, సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సీఈసీ ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల, యూటీల ఎన్నికల కమిషనర్లను ఆదేశించింది. అలాగే పోలింగ్ కేంద్రంలో వేచి ఉండేవారు కూర్చొనేందుకు బెంచీలను ఏర్పాటు చేయాలని సూచించింది. ఓటర్లు గందరగోళానికి గురికాకుండా ఉండేందుకు, అలాగే వారి అవగాహన కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఒకే రకమైన నాలుగు ఓటరు సౌకర్యాల పోస్టర్‌లను (ఎఫ్‌ఎ) ప్రదర్శించాలని కోరింది. ఈ పోస్టర్‌ల్లో పోలింగ్ కేంద్రం వివరాలు, అభ్యర్థుల జాబితా, అనుమతించే ఐడెంటిటీ ప్రూఫ్స్ జాబితా, ఓటింగ్ ప్రక్రియ వివరాలు ఉండాలని చెప్పింది.

ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు తమ పోలింగ్ బూత్ నంబరును, ఓటరు జాబితాలోని క్రమ సంఖ్యను కనుగొనడంలో సహాయపడటానికి బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌ఓ)/వీఏబీ) అందుబాటులో ఉంటాలని సీఈఓ పేర్కొంది. ఓటర్లు పోలింగ్ ప్రాంగణానికి సమీపిస్తున్నప్పుడు వీఏబీలు ఓటర్లకు అవసరమైన సూచనలు, సహాయం చేయాలని సూచించింది. అలాగే పోలింగ్ స్టేషన్ ప్రవేశ ద్వారం వెలుపల ఓటర్ల కోసం మొబైల్ ఫోన్ డిపాజిట్




సౌకర్యం కల్పించాలని స్పష్టం చేసింది. ఓటర్లు పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించే ముందు తమ ఫోన్‌ను (స్విచ్ఛాఫ్ చేసి) అక్కడి వాలంటీర్‌కు ఇచ్చి, ఓటేసిన తర్వాత మళ్లీ ఫోన్‌ను తీసుకోవచ్చని వెల్లడించింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలను కల్పించాలని ఆదేశించింది. ఓటర్లకు ఎలాంటి ఆటంకాలు లేని, ఆహ్లాదకరమైన ఓటింగ్ అనుభవాన్ని అందించేందుకు, పోలింగ్ తేదీలకు చాలా ముందుగానే అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించింది.

**ఈవీఎంల మొదట దశ ర్యాండిమైజేషన్ పూర్తి**

అసోం, కేరళ, పుదుచ్చేరిలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఈవీఎంలు, వీవీప్యాట్ల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని భారత ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారులు మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారని పేర్కొంది. ఈవీఎంలను వాటి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు కేటాయించే ప్రక్రియను రెండు దశల ర్యాండమైజేషన్ పద్ధతి ద్వారా నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. కాగా, ఈవీఎం రాండమైజేషన్ అనేది ఈవీఎంలను ఏ నియోజకవర్గానికి, ఏ పోలింగ్ కేంద్రానికి కేటాయించాలో నిర్ణయించే ప్రక్రియ. ఇది రెండు దశల్లో జరుగుతుంది. మొదటి దశలో నియోజకవర్గాల వారీగా, రెండో దశలో పోలింగ్ కేంద్రాల వారీగా యంత్రాలను కేటాయిస్తారు. ఇది ఎన్నికల్లో పారదర్శకతను పెంచుతుంది. అందుకే సీఈసీ ఈవీలంల ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపడుతోంది.

**త్వరలో అసెంబ్లీ ఎన్నికలు**

కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవలే కేరళ, తమిళనాడు, బంగాల్, అసోం, కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల కోసం షెడ్యూల్ రిలీజ్ చేసింది. కేరళ, పుదుచ్చేరి, అసోంలో ఒకే దశలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. బంగాల్‌లో ఏప్రిల్ 23, 29న రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. అలాగే తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. ఈ నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం, మరో ఆరు రాష్ట్రాల్లో జరిగే ఉపఎన్నికల ఫలితాలు మే 4న వెలువడనున్నాయి. కాగా, కేరళలో ప్రస్తుతం ఎల్డీఎఫ్ అధికారంలో ఉండగా, ఈ సారి అక్కడ లెఫ్ట్ కూటమి, యూడీఎఫ్, బీజేపీ మధ్య త్రిముఖ పోరు ఏర్పడింది. బంగాల్‌లో టీఎంసీ పాలన కొనసాగుతుండగా, ఆ పార్టీకి ఈ సారి బీజేపీ గట్టి పోటీ ఇవ్వనుంది. అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధించాలని సిద్ధమవుతుండగా, కమళదళాన్ని దెబ్బకొట్టాలని కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే, టీవీకే పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొంది.

# మమత కంచుకోట.. ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా!

**ఇంటర్నెట్ డెస్క్:** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలోనే భవానీపుర్ నియోజకవర్గం అందరి దృష్టి ఆకర్షిస్తోంది. కారణం.. ఇది ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సొంత నియోజకవర్గం కావడమే. పైగా ఈసారి భాజపా నేత సువేందు అధికారి సైతం ఇక్కడినుంచే పోటీకి దిగనున్నారు. ప్రస్తుతం దీదీకి కంచుకోటగా పేరున్న ఈ నియోజకవర్గంలో ఒకప్పుడు కాంగ్రెస్‌దే హవా. స్వాతంత్ర్యం అనంతరం దశాబ్దాలపాటు ఇక్కడ హస్తం పార్టీ నేతలదే పైచేయి. బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి సిద్ధార్థ శంకర్ రే.. భవానీపుర్ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు. మరోసారి స్వతంత్ర అభ్యర్థిగానూ ఆయన విజయం సాధించడం గమనార్హం. మీరాదత్తా గుప్తా, రథిన్ తాలుక్‌దార్ వంటి కాంగ్రెస్ దిగ్గజాలు కూడా ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు.

అనేక సంవత్సరాలపాటు కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగిన ఈ నియోజకవర్గం పేరును కాళీఘాట్‌గా మార్చారు. 1969 ఎన్నికల్లో సీపీఎం నేత సాధన్ గుప్తా గెలుపొందారు.

1972లో నియోజకవర్గాల పునర్విభజన అనంతరం.. ఈ నియోజకవర్గం కనుమరుగైపోయింది. మళ్లీ 2011లో డీలిమిటేషన్ తర్వాత భవానీపుర్ పేరిట పునర్వ్యవస్థీకరించారు. అదే ఏడాది జరిగిన శాసనసభ





ఎన్నికల్లోనే బెంగాల్‌లో వామపక్షాల సుదీర్ఘ పాలనకు తెరదించుతూ టీఎంసీ అధికారంలోకి వచ్చింది. భవానీపుర్‌లో దీదీ (మీఖఎఖు దీఖఅవతీయవవ) విశ్వాసపాత్రుడు సుబ్రతా బక్షీ గెలుపొందారు కొద్దికాలానికే బక్షీ ఆ సీటును ఖాళీ చేశారు. అప్పటికే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మమతా బెనర్జీ.. ఇదే స్థానం నుంచి ఉప ఎన్నికలో గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టారు. అప్పటినుంచి ఈ సీటు తృణమూల్ చేతుల్లోనే ఉంది. 2016లోనూ మమత 65 వేలకుపైగా ఓట్లతో విజయం సాధించారు.

పాలనలో.. మోదీ రికార్డు

2021లో నందిగ్రామ్ నుంచి పోటీ చేసిన మమత.. సువేందు అధికారి చేతిలో 1,956 ఓట్ల తేడాతో ఓడిపోయారు. భవానీపుర్‌లో మాత్రం టీఎంసీ అభ్యర్థి సోవందేబ్ ఛటోపాధ్యాయ విజయం సాధించారు. ఆయన రాజీనామా చేసిన అనంతరం జరిగిన ఉప ఎన్నికలో 58 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో మమతా విజయం సాధించారు.

దక్షిణ కోల్‌కతాలోని ఈ అసెంబ్లీ నియోజకవర్గం సామాజిక వైవిధ్యానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. ఇక్కడ బెంగాలీ మధ్యతరగతి కుటుంబాలతోపాటు పెద్ద సంఖ్యలో హిందీ మాట్లాడే వ్యాపార వర్గాలూ ఉన్నాయి. ఓటర్లలో బెంగాలీ హిందువులు దాదాపు 42 శాతం, బెంగాలీయేతర హిందువులు 34 శాతం, ముస్లింలు 24 శాతం ఉన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలతో సీఎం మమతా బెనర్జీ వ్యక్తిగత రాజకీయ అనుబంధాన్ని ఏర్పరచుకున్నారని, స్థానిక సామాజిక వాతావరణం ఆమెకు అనుకూలంగా ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## జైళ్లలో రద్దీపై సుప్రీంకోర్టు ఆందోళన



దేశవ్యాప్తంగా జైళ్లలో రద్దీ ఎక్కువగా ఉండటంపై సుప్రీం కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. జైళ్లలో ఖైదీల రద్దీని నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలతో పాటు అక్కడ అందుబాటులో ఉన్న వసతులపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. దేశవ్యాప్తంగా జైళ్లలో స్థితిగతులపై దాఖలైన పిటిషన్‌ను సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం, ఈ ఏడాది మార్చి 1 నాటికి జైళ్లలో ఉన్న ఖైదీల సంఖ్య, మంజూరైన సామర్థ్యం వంటి వివరాలను మే 18 లోగా అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని హోంశాఖ కార్యదర్శులను ఆదేశించింది. జస్టిస్ విక్రమ్?నాథ్, జస్టిస్? సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. మహిళా ఖైదీలతో పాటు వారితోపాటు ఉంటున్న చిన్నారుల భవిష్యత్తుపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. జైళ్లలో ఆయా చిన్నారులకు అందుతున్న విద్య, ఆరోగ్య సదుపాయాలపై స్పష్టత ఇవ్వాలని కోరింది. జైళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులు, వాటి భర్తీకి తీసుకుంటున్న చర్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అమికస్ క్యూరీ అందించిన వివరాలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం కోర్టు జైళ్లలో పాలనా సంస్కరణలు అనివార్యమని అభిప్రాయపడింది. ఈ విచారణను సమర్థంగా పరిగణనలోకి తీసుకోవడానికి తాజా సమాచారం అందుబాటులో ఉండటం అత్యవసరమని ధర్మాసనం అభిప్రాయపడింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నమోదు చేసిన గణాంకాలు 2023 సంవత్సరానికి సంబంధించినవని తమ దృష్టికి తీసుకువచ్చినట్లు ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలోనే ఈ కేసు తదుపరి విచారణను మే 26కు వాయిదా వేసింది. "అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ అధికార పరిధిలోని అన్ని జైళ్లకు సంబంధించిన తాజా, సమగ్ర గణాంకాలతో కూడిన జైలు రికార్డులు పొందుపరిచాలి. ఈ అఫిడవిట్?లో ప్రతి జైలు వారీ సామర్థ్యం, మొత్తం ఖైదీల సంఖ్య, ప్రతి జైలులో అధిక రద్దీ శాతం, రద్దీని పరిష్కరించడానికి ప్రతిపాదించిన చర్యలు, మహిళా జైళ్ల వివరాలు, మహిళా ఖైదీలు, వారితో పాటు వచ్చే పిల్లలకు అందించే విద్యా, వైద్య సౌకర్యాలు, మంజూరైన జైలు సిబ్బంది సంఖ్య, ప్రస్తుతం ఉన్న ఖాళీలు, వాటిని భర్తీ చేయడానికి తీసుకున్న చర్యలు, అలాగే జైలు పరిపాలనకు సంబంధించిన అన్ని అనుబంధ అంశాలు ఉండాలి. 2026 మార్చి 1 నాటికి కటాఫ్? తేదీగా వివరాలను అందించాలి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మే 18 లోగా హోం సెక్రటరీతో అవసరమైన వివరాలతో కూడిన సమగ్ర అఫిడవిట్లను దాఖలు చేయాలి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందిన అఫిడవిట్ల కాపీలను సుప్రీం కోర్టు రిజిస్ట్రీ, ఏర్పాటు చేసిన అమికస్‌కు పంపుతుంది. వారు అందించిన గణాంకాలు, సమాచారాన్ని పరిశీలించి అమికస్ క్యూరీ ఒక సమగ్ర నివేదికను తయారు చేస్తారు."

**సోషల్? మీడియాల్లో పంచుకునే ధోరణి పట్ల సుప్రీం కోర్టు ఆందోళన**

మరోవైపు మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేసిన వీడియోలను ప్రజలు వెంటనే సోషల్? మీడియాల్లో పంచుకునే ధోరణి పట్ల సుప్రీం కోర్టు శనివారం ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారతాయని చెప్పింది. నిందితుల వీడియోలు, ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాల్లో అప్‌లోడ్ చేసి, ప్రజల్లో పక్షపాత ధోరణిని సృష్టిస్తున్నారంటూ ఓ పిల్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది.

## మోదీ రికార్డు

భారత ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించాడు. ప్రభుత్వాధినేతగా 8,391 రోజులు పూర్తి చేసుకుని రికార్డు సృష్టించాడు. అటు సీఎంగా, ఇటు ప్రధానిగా మోదీ ఈ ఘనత దక్కించుకున్నాడు. 24 ఏళ్లకు పైగా రాజ్యాంగ బద్ధమైన ప్రభుత్వాధినేతగా, అది కూడా మధ్యలో ఎలాంటి విరామం లేకుండా కొనసాగి మోదీ రికార్డు నెలకొల్పాడు. దీంతో ఇప్పటివరకు అత్యధిక (8,390) రోజులు పదవిలో కొనసాగిన సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ ఛామ్లింగ్ రికార్డును మోదీ అధిగమించారు. ప్రధాని మోదీ తొలిసారిగా 2001లో గుజరాత్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2014లో ప్రధాని పదవి చేపట్టేవరకు ఆయన సీఎంగానే కొనసాగారు. ప్రధానిగా మోదీ ఇంకా కొనసాగుతూనే ఉన్నారు. ఇదే సమయంలో గుజరాత్ రాష్ట్రానికి ఎక్కువ కాలం సీఎంగా పని చేసిన ఘనత కూడా ఆయన సొంతం. అలాగే, ముఖ్యమంత్రుల నుంచి ప్రధాని పదవి చేపట్టి, ఎక్కువ కాలం కొనసాగింది కూడా మోదీయే. మోదీ ప్రధానిగా హ్యాట్రిక్ సాధించారు. 2014, 2019, 2024లో మోదీ తన పార్టీని, కూటమిని గెలిపించి అధికారం చేపట్టారు. ఇంతకుముందు మూడుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన జవహర్ లాల్ నెహ్రూ రికార్డును సమం చేశారు. వరుసగా దేశంలో అత్యధిక రోజులు పదవిలో కొనసాగిన రెండో ప్రధానిగా కూడా మోదీ నిలిచారు. ఈ విషయంలో ఇందిరాగాంధీ రికార్డును మోదీ దాటారు. అలాగే ఒక పార్టీ పక్ష నేతగా వరుసగా ఆరుసార్లు ఎన్నికైన ఘనత కూడా ఆయనదే. మోదీ అత్యధిక రోజులు దేశంలో ప్రభుత్వాధినేతగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుభాకాంక్షలు తెలిపారు.

## 'కెనడా, భారత్ కలిసి పనిచేయాలి'

## ఇండియా మాజీ హైకమిషనర్ పిలుపు

**న్యూఢిల్లీ,** ఒట్టావాలు కలిసి పనిచేయాలని కెనడాలోని భారత మాజీ హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ అభిప్రాయపడ్డారు. గత దౌత్యపరమైన ఘర్షణలను ఇరు దేశాలు అధిగమించాలని పేర్కొన్నారు. కెనడా, భారత్ మధ్య పరస్పర సహకారం అవసరమని వెల్లడించారు. ప్రముఖ వార్తా సంస్థ ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరు దేశాల సంబంధాల గురించి సంజయ్ కుమార్ కీలక విషయాలు పంచుకున్నారు. "పరస్పర సహకారం అనేది ఇప్పుడు రెండు దేశాలకు మంచిది. ఇది దౌత్యపరమైన ఆచరణ. కెనడా–భారత్ కలిసి పనిచేయాలి. ఇరు దేశాలు కలిసి పనిచేసినప్పుడు విభేదించే అంశాలు ఉంటాయి. కెనడా, భారత్ మధ్య ఏకాభిప్రాయం కుదిరే అంశాలు కూడా ఉంటాయి. కాబట్టి ఏ అంశాలపై అయితే రెండు దేశాల మధ్య ఏకాభిప్రాయం ఉంటుందో ఆ అంశాలపై ముందుకు వెళ్లాలి. ఏకాభిప్రాయం కుదరని విషయాలపై ఇరు దేశాలు చర్చించుకోవాలి. మాట్లాడుకోవాలి. కానీ ఒక దేశాన్ని మరొక దేశం దూషించుకూడదు." అని కెనడాలో భారత మాజీ హైకమిషనర్ తెలిపారు.

**నిజ్జర్ హత్య గురించి ప్రస్తావన**


ఖలిస్థానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య గురించి కూడా భారత మాజీ హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ ప్రస్తావించారు. నిజ్జర్ హత్యకు సంబంధించిన న్యాయపరమైన విచారణకు, ప్రభుత్వ ప్రాయోజిత జోక్యంపై ఉన్న విస్తృత ఆరోపణలకు మధ్య తేడాను రాయల్ కెనేడియన్ మౌంటెడ్ పోలీస్ (ఆర్‌సీఎంపీ) ఇప్పుడు గుర్తించిందని అన్నారు. అదృష్టవశాత్తూ కెనడా ప్రస్తుత ప్రధానమంత్రి కార్నీ భారత్‌తో సంబంధాల విషయంలో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఇటీవల ఆయన భారత పర్యటన కూడా విజయవంతమైందని పేర్కొన్నారు. "వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో నలుగురు భారత జాతీయులపై అభియోగాలు దాఖలయ్యాయి. వారందరూ ఉన్నత చదువుల కోసం కెనడాకు వెళ్లారు. వారిపై వచ్చిన అభియోగాలపై విచారణ కొనసాగుతోంది. నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ ప్రమేయం ఉందన్న వాదనకు కెనడా వద్ద ఆధారాలు లేవు. నేను కెనడాలో భారత హైకమిషనర్‌గా ఉన్నప్పుడు అక్కడ జరుగుతున్న అంతర్జాతీయ అణచివేత, అంతర్జాతీయ నేరాలలో భారత్ పాత్రపై చాలా దుమారం రేగింది. ఏ ఇతర దేశ అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకోదు. దురదృష్టవశాత్తు ఆ సమయంలోని కెనడా ప్రభుత్వం ఈ విషయాన్ని గ్రహించలేదు"

# అనుకున్నదొక్కటి.. అయిందొక్కటి...

## రీజినల్ రింగ్ రోడ్డు కాస్త సాధారణ హైవేగా మార్పు!

హైదరాబాద్ చుట్టూ రావాల్సిన రీజినల్ రింగ్ రోడ్డు కాస్త ఇప్పుడు సాధారణ హైవేగా మారిపోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ట్రిపుల్ఆర్ డిజైన్‌లో భారీ మార్పులు చేశారు. భారీ వ్యయం వల్ల ట్రిపుల్ఆర్ ప్రత్యేకతలను తొలగించి సాధారణ హైవేగా మార్పు చేశారు. తొలుత దేశంలోనే 8 లైన్లతో కూడిన అతి పొడవైన రింగ్ రోడ్డుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసింది. అయితే దేశంలో మరో 20 ఏళ్ల వరకు రోడ్డు ట్రాఫిక్ కి 8 లైన్లు అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం ఆరు లైన్లకు కుదించింది. తొలుత అన్నకున్న దాని ప్రకారం రింగ్ రోడ్డు పొడవునా ఎలక్ట్రిక్ లైట్లు, ఎల్ఈడీ స్ట్రీట్ లైటింగ్ వ్యవస్థను ప్రతిపాదించారు. ఇప్పుడు ఎల్ఈడీ స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు భారీ ఖర్చుతో కూడుకున్నది అని చెబుతూ కేవలం గ్రామాలు తగిలే ప్రాంతాల్లో మాత్రమే లైట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

తొలుత - తరహాలో ట్రిపుల్ ఆర్‌కు కూడా సర్వీస్ రోడ్డును ప్రతిపాదించారు. కానీ ఇప్పుడు కనీసం కచ్చా రోడ్డు యాక్సెస్ కూడా లేకుండా కేవలం ఖాళీ స్థలం మాత్రమే ఉండేట్లుగా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తొలుత ట్రిపుల్ ఆర్‌పై గరిష్ట వేగం గంటకు 120-130 కిలోమీటర్లు ఉండగా.. ఇప్పుడు గరిష్ట వేగం తగ్గించి గంటకు 100 కిలోమీటర్లు మాత్రమే చేశారు. తొలుత ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగంలోనే మొత్తం 204 వంతెనలు నిర్మించాలని ప్రతిపాదించగా.. ఇందులో మూసీ నది మీద, మంజీరా నది మీద, హరిద్ర నది మీద, పలు వాగులు వంకల మీద వంతెనలు, కల్వర్టులు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇప్పుడు వంతెనల వ్యయం



భారీగా ఉండటంతో సగానికి సగం కుదించారు. రోడ్డు నిలువు వాలు (వర్టికల్ కర్వ్) 1300 మీటర్లు ఉండేలా డిజైన్ అనుకున్నారు. అంటే 600 మీటర్ల దూరంలో పిల్లి సైజు జంతువు రోడ్డు దాటుతున్నా కనిపిస్తుంది. ముందే అప్రమత్తమై వేగాన్ని నియంత్రించే వీలు ఉండేది. కానీ ఇప్పుడు రోడ్డు నిలువు వాలు 650 మీటర్లకు కుదింపు.. అంటే కేవలం 360 మీటర్లు మాత్రమే విజిబిలిటీ ఉంటుంది. వాహనాలు ఒకవేళ పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తే ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది.

# కరెంట్ బిల్లు ఎక్కువగా వస్తోందా?

## అయితే 'బిజిలీ ఆడిటర్' మీ వద్ద ఉండాల్సిందే

ఎండాకాలం వచ్చేసింది. పిల్లలకు సెలవుల ప్రభావంతో ఫ్యాన్లూ ఏసీలూ, టీవీల వాడకం విపరీతంగా పెరిగిపోతుంది. సహజంగానే ఈ రెండు మూడు నెలలూ కరెంటు బిల్లు కాస్తా ఎక్కువగా పెరుగుతుంది. కానీ ఆ చిల్లు ప్రతి వేసవిలో ఉన్నట్టే ఉంటే ఫర్వాలేదు. ఒకేసారి మూడు నాలుగు రెట్లు ఎక్కువైతే మీరు ఏం చేస్తారు? డిస్కం వాళ్లు కూడా దాన్ని ఏం చేయలేమంటే ఎవరితో బాధను చెప్పుకుంటారు? ఇలాంటి సమస్యల్నే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? టెక్నాలజీ సాయంతో పరిష్కరిస్తోంది భారత్ స్మార్ట్ సర్వీసస్! అనే సంస్థ. కరెంటు ఆడిటర్స్?గా పనిచేస్తున్న ఈ హైదరాబాదీ సంస్థ అందిస్తున్న సరికొత్త సేవలను తెలుసుకోండి. హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఓ మూడు బెడ్?రూం ఫ్లాట్‌లో ఓ కుటుంబం ఉంటుంది. మామూలుగా రూ.7 వేల రావాల్సిన పవర్ బిల్లు ఆరు నెలల కింద రూ.25 వేలు వచ్చింది. ఎలక్ట్రీషియన్‌ని పిలిస్తే అన్నీ బాగానే పనిచేస్తున్నాయనీ ఒకసారి మీటర్ మార్చి చూడమనీ అన్నాడు. అది మార్చినా సరే, తర్వాతి నెలా కూడా అంతే బిల్లు వచ్చింది! దాంతో వాళ్లు నేరుగా సంబంధిత డిస్కమ్‌కి ఫిర్యాదు చేశారు. వాళ్లు ఒకసారి చెక్‌చేసి తమ సైడు నుంచి సమస్యేమీ లేదన్నారు కానీ ఈసారీ బిల్లు పాతికవేలు దాటి షాక్? ఇచ్చింది. విద్యుత్తు లీకేజీ సమస్య : అప్పుడే ఆ కుటుంబం భారత్ స్మార్ట్ సర్వీసస్‌ను సంప్రదించింది. ఆ సంస్థ నిపుణులు ఏఐతో పనిచేసే అత్యాధునిక టెక్నాలజీతో రంగంలోకి దిగారు. అవి ఈ కుటుంబం వాడకుండా తాళం వేసి ఉన్న మూడో గదిలో సమస్య ఉన్నట్టు చూపించాయి. అందులోకి వెళ్లి చూస్తే లోపల ఏసీకి వెళ్లాల్సిన కరెంట్? లీక్(షార్ట్) అవుతోందని తెలిసింది. అంటే, ఏసీ ఆన్‌లో లేకపోయినా కరెంటు అక్కడికి పాస్ అవుతోందన్నమాట! ఆ లీకేజీ న్యూట్రల్‌లోనే జరగడం వల్ల షాక్ రావడం లేదన్నమాట. దాంతో దానిని ఎవరూ పసిగట్టలేకపోయారు. అలా రోజూ 13 యూనిట్‌ల కరెంటు వృథాగా పోతుందని తేల్చారు ఆ సంస్థ నిపుణులు. దాన్ని సవరించగానే వాళ్ల బిల్లు ఎప్పట్లాగే రూ.7 వేలు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఫ్రిజ్‌లోని కంప్రెసర్ సమస్య : ఆయన ఒక కార్మికుడు. వాళ్లింటికి మామూలుగా నెలకు 120 యూనిట్‌లు ఖర్చయ్యి సుమారు రూ.500 బిల్లు వచ్చేది. వరసగా మూడు నెలలు 260 యూనిట్‌లు వినియోగం అయ్యి ఏకంగా రూ. 1200 రావడంతో బెంబేలెత్తిపోయారు. భారత్ స్మార్ట్ సర్వీసస్ సంస్థని



సాయం అడిగితే వాళ్లు వచ్చి పది నిమిషాల్లోనే ఫ్రిజ్‌లోని కంప్రెసర్‌లో సమస్య ఉందని చెప్పారు. మామూలుగా రోజూ ఒక్క యూనిట్ మాత్రమే తీసుకోవాల్సిన ఫ్రిజ్ 3.5 యూనిట్‌ల కరెంటుని లాగేస్తోందనీ తేల్చారు! ఎలుక వల్ల రూ.12 లక్షల కరెంట్? బిల్లు : హైదరాబాద్ కొంపల్లిలో సీలింగ్ ఫ్యానులు తయారుచేసే యాష్ ఇంటర్నేషనల్ సంస్థకైతే నెలకి రూ.80 వేలు రావాల్సిన బిల్లు ఏకంగా భారీగా రూ.12 లక్షలకి చేరింది. ఒక్కసారిగా భయపడిపోయిన యజమానిని భారత్ స్మార్ట్ సర్వీసెస్ సంస్థ కాపాడింది. వోల్టేజ్ హెచ్చు తగ్గుల్ని సవరించాల్సిన ఏపీఎఫ్‌సీ(ఆటోమెటిక్ పవర్ ఫ్యాక్టర్ కంట్రోలర్) యంత్రంలో ఎలుక దాడివల్ల కరెంటు లీకేజీ అవుతోందని పసిగట్టి బిల్లుని మామూలు పరిస్థితికి తీసుకొచ్చారు. ఇలా చేస్తారు : భారత్ స్మార్ట్ సర్వీసస్ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో గత మూడేళ్లుగా ఇలాంటి 'కరెంట్ ఆడిటింగ్' సేవల్ని విస్తృతంగా అందిస్తోంది. ఇందుకుగాను రూ. వెయ్యి వరకూ ఛార్జ్ చేస్తుంది. అంతేకాదు, సగటు వినియోగదారులు తమకు తామే విద్యుత్తు పరికరాల తీరుతెన్నుల్నీ, రోజువారీ వినియోగాన్నీ తెలుసుకోవడానికని సరికొత్త అత్యాధునిక పరికరాలను అందిస్తోంది. వాటిల్లో స్మార్ట్ ప్లగ్ అనేదానిని టీవీ, ఫ్రిజ్, ఏసీ, గీజర్ వంటి వాటికి కనెక్ట్? చేస్తే వాటి బాగోగుల్ని అంచనా వేస్తూ ఉంటుంది. అవి అవసరానికన్నా ఎక్కువ విద్యుత్తుని తీసుకుంటే మనల్ని వెంటనే అలర్ట్ చేస్తుంది. ఉదాహరణకు ఓ గీజర్ ఉందనుకుందాం. అది నీటిని పూర్తిస్థాయిలో వేడి చేయడానికి 13 నిమిషాలు తీసుకుంటే. ఎండాకాలంలో అంత వేడి అవసరంలేదు ఉండదు. అందువల్ల ఆరునిమిషాలు పనిచేస్తే చాలు. ఈ పరికరంతో ఆ మేరకు గీజర్ పనిచేసే సమయాన్నీ, వినియోగించాల్సిన యూనిట్‌లనీ ముందే సెట్ చేయొచ్చు. బిజిలీ ఆడిటర్? ఉంటే చాలు : ఇలా ఏదో ఒక పరికరానికే పరిమితం కాకుండా ఓ ఇంటికి కావాల్సిన మొత్తం పవర్? సిస్టంను పర్యవేక్షించడానికి బిజిలీ ఆడిటర్ అనే పరికరాన్ని కూడా తీసుకొచ్చింది. అంతేకాదు, తమ యాప్ ద్వారా ఉచితంగా సర్వీసెస్?ను అందిస్తోంది భారత్ స్మార్ట్ సర్వీసస్. వినియోగదారులు చివరగా వచ్చిన తమ కరెంటు బిల్లునీ, వారంలో ఓ రెండుసార్లు మీటర్ రీడింగ్‌నీ ఫొటో తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే చాలు మన కరెంటు బిల్లు తీరుతెన్నుల్ని అలా చిటికెలా చెప్పేస్తుంది. భవిష్యత్తులో రాబోయే బిల్లును కూడా అంచనా వేస్తుంది.

## పంటల విధానంలో మరిన్ని మార్పులు

-మొదటిపేజీ తరువాయి

మారాయని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా, రైతు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా నిధులను మొత్తం 3 విడతల్లో పూర్తి చేస్తామని, 45 రోజుల్లో 3 విడతల్లో రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు వేయనున్నామని వెల్లడించారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చి, రుణమాఫీ కూడా చేశామని గుర్తు చేసిన సీఎం, వరికి బోనస్ ఇస్తున్నామని, వరదల వల్ల నష్టపోతే పరిహారం ఇస్తున్నామని వివరించారు. రైతుల కోసం ఇప్పటివరకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు.

**పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాలి**

తెలంగాణ ప్రాంతం నిజాం కాలంలోనే వాణిజ్య పంటలకు ప్రసిద్ధిగా ఉండేదని గుర్తు చేసిన సీఎం, రాష్ట్రంలో పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాలని పిలుపునిచ్చారు. గతంలో రంగారెడ్డి జిల్లాలో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు బాగా పండించే వారని, రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల రంగారెడ్డి జిల్లా పంటల సాగు తగ్గిందన్నారు. ఫలితంగా కూరగాయలు, పండ్లు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే కేంద్రం 50 లక్షల టన్నుల వరి మాత్రమే కొంటామని చెప్తోందన్న ఆయన, పంట మార్పిడి ద్వారా మాత్రమే వ్యవసాయం లాభసాటి అవుతుందని స్పష్టం చేశారు.

సిద్దిపేటలో నిర్మించిన ఫ్యాక్టరీ కొడంగల్‌లోనూ నిర్మించాలని మంత్రి తుమ్మలకు విజ్ఞప్తి చేస్తున్నా. అంకాపూర్ రైతులను ఆదర్శంగా తీసుకుని రైతులంతా ముందుకెళ్లాలి. తెలంగాణలో ఒక్కో జిల్లా, ఒక్కో పంటకు ప్రసిద్ధి. తెలంగాణలో సారవంతమైన భూములున్నాయి. కష్టపడే రైతులు ఉన్నారు. మన పంటలను ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 73 లక్షల మంది రైతులున్నారు. వీరందరికీ తొలి విడతలో ఒక ఎకరం వరకు సాయం అందించనున్నారు. దీనికోసం రూ.3,590 కోట్లు ఆదివారం ఆర్బీఐ ద్వారా బ్యాంకులకు, అటు నుంచి రైతులకు చేరవేయనున్నారు. అయితే ఆదివారం సెలవు కావడంతో ఈ నిధులు సోమవారం అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి. రెండో విడతగా ఇరవై రోజుల అనంతరం రూ.2,650 కోట్లు, తర్వాత మూడో విడతగా రూ.2,760 కోట్లు విడుదల చేయనున్నారు. తెలంగాణలోని మొత్తం రైతుల్లో 24.32 లక్షల మందికి ఎకరం వరకు వ్యవసాయ భూమి ఉంది. మిగిలిన 48.68 లక్షల మందికి ఎకరం కంటే ఎక్కువ వ్యవసాయ భూములు ఉన్నాయి.

**పంటల మార్పిడి చేస్తే బోనస్**

పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికోసం రాష్ట్రంలో అధిక కొరత, డిమాండ్ ఉన్న పంటలకు బోనస్? ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆదివారం నర్మెటలో జరిగే రైతు ఉత్సవాల్లో కొత్త పంటలకు బోనస్?పై విధాన నిర్ణయం ప్రకటించే అవకాశమున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం రెండు సీజన్లలో 30 రకాల పంటలను పండిస్తున్నారు. వీటిని 2.14 కోట్ల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో 1.28 కోట్ల ఎకరాల్లో వరి, 50 లక్షల ఎకరాల్లో పత్తి ప్రధాన పంటలుగా వేస్తున్నారు. తర్వాత స్థానాల్లో మొక్కజొన్న, కందులు, సోయాబీన్ ఉన్నాయి.

ప్రభుత్వం రెండేళ్లుగా సన్నవడ్లకు ప్రోత్సాహకం అందజేస్తోంది. దీనికోసం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్? ఇస్తోంది. దీనికి 2025-26 బడ్జెట్‌లో రూ.1,800 కోట్లు కేటాయించింది. ఆయిల్?పామ్?తో పాటు ఇతర నూనె గింజలు, మొక్కజొన్న, పసుపు, పప్పు ధాన్యాలు, వేరు శనగ పంటలకు సైతం బోనస్? ఇవ్వాలని రైతుల నుంచి డిమాండ్లు పెరగడంతో ప్రభుత్వం దానిపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే 2026-27 బడ్జెట్?లో పంటల బోనస్?కు మొత్తంగా రూ.3,500 కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది.

## ఇళ్ల పంపిణీలో అక్రమాలు

-మొదటిపేజీ తరువాయి

దీంతో అవాక్కైన ఆ మహిళ మీరు ఎవరండి అని అడగగా అవతల ఉన్న మహిళ "నేను ఎవరో తరువాత చెబుతాను. మొదట మీ దగ్గరికి ఒకరు వస్తారు. వారికి రూ.5,000 ఇవ్వు" అని మరోసారి చెప్పింది. ఈసారి పేద మహిళ తన వద్ద పైసలు లేవని, అయినా మీరు ఎవరో చెప్పకుండా పైసలు ఎలా ఇస్తామని అడిగింది. "అయితే సరే ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో మీ పేరు తొలగిస్తాం" అంటూ బెదిరించి కాల్? కట్ చేసింది. ఇలాంటి ఫోన్ కాల్స్? హుజూర్‌నగర్‌లో పలువురు మహిళలకు వస్తున్నాయని పలువులు అంటున్నారు. కొందరు రూ.5,000 ఇచ్చుకోలేమంటూ కొద్ది మొత్తంలో ఇచ్చుకున్న వారు కూడా ఉన్నట్లు సమాచారం.

**పేద ప్రజల ఆందోళన**

హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద కట్టించిన ఇందిరమ్మ ఇళ్లకు ఇటీవల 805 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. వీరిలో కొందరిని దళారులు పట్టి పీడిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు ఇలా ఫోన్లు చేసి నగదు అడుగుతుండటంతో వీరు ఎవరో అర్థం కాక పేద మహిళలు ఆందోళన చెందుతున్నారు. "మీ పేర్లు తొలగిస్తున్నాం" అని చెబుతున్న ఆ మహిళ నిజంగా తమ పేర్లను తొలగిస్తుందా? అని ఆందోళన పడుతున్నారు పేద మహిళలు. దీంతో లబ్ధిదారులు కొందరు తమకు తెలిసిన నేతల చుట్టూ తిరిగి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. వరుస సెలవులు ఉండటంతో బాధితులు అధికారులకు మొర పెట్టుకునే అవకాశం లేకపోవటంతో రాజకీయ నేతల చుట్టూ తిరుగుతున్నారు. అనర్హులకు ఇళ్లు వచ్చాయని, విడుదల అయిన జాబితాలో చేర్పులు మార్పులు చోటు చేసుకుంటాయని చెబుతున్న పరిస్థితుల్లో ఇలాంటి ఫోన్లు వస్తుండటంతో తమ పేరు జాబితాలో ఉంటుందా లేదా అన్న ఆందోళనలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉన్నారు.

**వారికే ప్రాధాన్యం**

ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో గ్రామాలు, పట్టణాల వారీగా ఎక్కడెక్కడ ఎన్ని కేటాయించాలనే దానిపై అధికారులు దృష్టి సారించారు. మొత్తం 3,500 ఇళ్లలో గ్రామాలు, పట్టణాల వారీగా మంజూరు చేసిన వాటి వివరాలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి సమర్పిస్తే ఆయన ఆమోదం తెలుపుతారు. అనంతరం ఎన్ని మంజూరు అయ్యాయో మళ్లీ గ్రామసభల్లో ప్రదర్శిస్తారు. ఎంపికలో ఒంటరి మహిళలు, అతి పేదలు, వితంతువులు, దివ్యాంగులకు ప్రాధాన్యం ఇస్తారు. గ్రామాల్లో లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఇందిరమ్మ కమిటీలు ప్రధాన పాత్ర పోషిస్తాయి.

# మామిడి పండ్ల సీజన్ వచ్చేసింది - పండ్ల మార్కెట్‌లో సందడి మొదలైంది

ఫ్రూట్ కింగ్ మామిడి సీజన్ రానే వచ్చింది. మార్కెట్లో మామిడి హవా మొదలైంది. హైదరాబాద్ శివారు ప్రాంతమైన బాటసింగారంలోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌కు మామిడి కాయల రాక క్రమంగా పెరుగుతోంది. రాష్ట్రంలో అతిపెద్ద పండ్ల మార్కెట్ కావడంతో రైతులు, వర్తకులు, చిరు వ్యాపారులు, వినియోగదారులతో సందడి వాతావరణం నెలకొంది. ఈ ఏడాది ధరలు కొంత ఆశాజనకంగా ఉండటంతో క్రయ, విక్రయాలు ఊపందుకుంటున్నాయి. వేసవి ఎండలు పెరుగుతుండటంతో మామిడితో పాటు ఇతర పండ్ల విక్రయాలు కూడా జోరుగా సాగుతోన్నాయి.

దక్షిణ భారతదేశంలో అతిపెద్ద మార్కెట్ కావడంతో ఉగాది ముందు రోజు నుంచి రైతులు, వర్తకులు, చిరు వ్యాపారులు, వినియోగదారులతో సందడి వాతావరణం నెలకొంది. ఈ ఏడాది మామిడి సీజన్ ఇటీవల ఆరంభం కావడం వల్ల ధరలు మంచి ఆశాజనకంగా ఉండటంతో క్రయ, విక్రయాలు ఊపందుకుంటున్నాయి. వేసవి ఎండలు పెరుగుతుండటంతో మధుర ఫలం మామిడితో పాటు పుచ్చకాయలు, కర్బూజ, నారింజ, సపోట, ద్రాక్ష, స్ట్రాబెర్రీ, దానిమ్మ పండ్లను కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. పాలమూరు రైతుల అమ్మకాలు : రాష్ట్రంలో పలుచోట్ల మామిడి పంట చేతికి రావడంతో మార్కెట్లకు రైతులు తరలివస్తున్నారు. దీంతో మామిడి రాక సందర్భంగా మార్కెట్లు కళకళలాడుతున్నాయి. ఉగాది పండుగ నుంచి హైదరాబాద్ శివారు ప్రాంతం బాటసింగారంలోని పండ్ల మార్కెట్ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు గ్రామాల నుంచి రైతులు మామిడిని తీసుకొచ్చి మార్కెట్‌లో అమ్ముతున్నారు.

"మా పంటకు మరో రెండు నెలలు కూడా ఈ తరహా ధరలే ఇవ్వాలి. ఎందుకంటే అధిక మొత్తంలో పంట నష్టం జరిగింది. భారీ వర్షాలు వల్ల పూత రాలి పోయి దిగుబడి తగ్గింది. ఇదే ధరను అలానే కొనసాగించి రైతులను ఆదుకోవాలని కోరుకుంటున్నా" రైతులకు ఆశాజనకంగా ధర : ఒక్కరోజే 100 పైగా లారీల్లో సరుకు అమ్మకానికి రావడంతో వేలం పాటలో రైతులకి మంచిధర లభించింది. ఈ ఏడాది వర్షాలు, మంచు వంటి ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో పూత, పిందె, కాయ వివిధ దశల్లో తెగుళ్లు, చీడపీడల ప్రభావంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. తొలిదఫాలో ధరలు ఆశాజనకంగా రైతుకు స్వాగతం పలికాయి.

**ఈసారి తగ్గిన మామిడి దిగుబడి**

గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం మామిడి సీజన్?పై రైతులు, వర్తక వర్గాలు ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏట వాతావరణ పరిస్థితి సరిగ్గా లేకపోవడంతో చాలా వరకు దిగుబడి తగ్గింది. సీజన్ నిరాశతో మొదలైనా వచ్చిన కాస్త పంటకైనా మంచి ధర లభిస్తుండటంతో కర్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో పెద్ద మొత్తంలో సరుకు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. హానికారక రసాయనాలతో మాగబెట్టే పండ్లపై దృష్టిసారించిన అధికారులు వాటి కట్టడికి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

"ఈసారి చాలా తక్కువగా దిగుబడి వచ్చింది. మామిడి పంట ఈసారి గణనీయంగా తగ్గింది, కాయలు లేవు. గత సంవత్సరంతో పోల్చితే ఈసారి 70 నుంచి 80 శాతం కాయలు లేవు. అయినా ఇప్పుడు కల్పిస్తున్న ధర లాభదాయకంగానైతే లేదు. వర్షాలు ఎక్కువగా పడ్డాయి. దీంతో పాటు మంచు కూడా కురిసింది. ఎన్ని మందులు పిచికారి చేసిన పూత, పిందెలు రాలిపోయాయి. దానివల్ల రైతులు బాగా నష్టపోయారు" "ఈసారి పంట చాలా తక్కువగా ఉంది. సీజన్? ఇప్పుడిప్పుడే మొదలైంది. ధర మాత్రం పర్వాలేదు మంచిగానే ఉంది. కాకపోతే ఈ మార్కెట్? దూరమైనందున కొహెడ మార్కెట్? తొందరగా అందుబాటులోకి తెస్తే మంచిది. మార్కెట్?కు



మామిడి కాయల కోసం వచ్చి కొనుగోలు చేసే వారికి అమ్మేవారికి దూరం ఉండటం వల్ల చాలా ఇబ్బంది అవుతుంది. కొహెడ మార్కెట్? త్వరగా అందుబాటులోకి తెస్తే చాలా బాగుంటుంది"

# సంపాదకీయం

## యుద్ధనౌకల్లో సైనిక తిరుగుబాట్లు!

ఇజ్రాయెల్ ఒత్తిడితో ఇరాన్‌పై కయ్యానికి కాలు దువ్విన అమెరికా పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా తయారైంది. సుదీర్ఘ కాలం యుద్ధాన్ని కొనసాగించలేక, నిలిపివేయలేక అగ్రరాజ్యం సతమతమవుతున్నది. మిత్రదేశాల నుంచి కూడా వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో సంకటాన్ని ఎదుర్కొంటున్నది. బయట నుంచి వ్యతిరేకత సంగతి అటుంచితే, ఇప్పుడు సొంత సైన్యంలోనే తిరుగుబాటు మొదలైంది. అమెరికాకు చెందిన అతిపెద్ద యుద్ధనౌకను సొంత సైనికులే తగలబెట్టే స్థాయి ఉపద్రవం అమెరికాను ఆలోచనలో పడేసింది. అగ్రరాజ్యం, ప్రపంచ దేశాల పెద్దన్నగా పేరొంది, ఆధిపత్యంతో, సామ్రాజ్యవాద కాంక్షతో రగిలిపోయే అమెరికా పరువుపోయే పరిస్థితి వచ్చింది. అంతా నా ఇష్టం.. నేను చెప్పిందే శాసనం.. నా మనఃసాక్షికి మాత్రమే నేను జవాబుదారీ అంటూ విర్రవీగుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. ఇరాన్ యుద్ధంలో పాల్గొంటున్న నౌకాదళ సైనికులు తిరుగుబాటు జెండా ఎగురవేశారు. ఇరాన్‌పై యుద్ధంలో కీలక పాత్ర పోషిస్తున్న అమెరికాకు చెందిన అతిపెద్ద యుద్ధనౌక యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్‌లో మంటలు చెలరేగాయి. ఇది అగ్ని ప్రమాదం అని అమెరికా బయటకు చెప్తున్నది. కానీ ఈ మంటలు మామూలు మంటలు కాదని, సైనిక తిరుగుబాటు ఆగ్రహ జ్వాలలు అని విశ్వసనీయవర్గాల సమాచారం ఆధారంగా ప్రఖ్యాత మీడియా సంస్థలు కథనాలు వెలువరిస్తున్నాయి. అమెరికా నావికాదళ దర్యాప్తు సంస్థ కూడా నౌకలో జరిగిన ఘటనపై తిరుగుబాటు కోణంలో విచారణ చేపట్టింది. యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్, చమురు కొరత ఏర్పడింది. ధరలు భారీగా పెరిగిపోయి ఆర్థిక వ్యవస్థలు దుర్భరంగా మారాయి. దీనంతటికీ కారణమైన అమెరికా పట్ల చిరకాల మిత్రదేశాలు, గల్ఫ్ దేశాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. అంతేకాకుండా అగ్రరాజ్యానికి దూరం జరుగుతున్నాయి. ఇదంతా ప్రపంచ వ్యాప్తంగా అమెరికా ఎదుర్కొంటున్న పరిస్థితి. అంతేకాకుండా ఇప్పుడు సొంత సైన్యంలోనే తిరుగుబాటు మంటలు రగులుతున్నాయి. ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో నెలల తరబడి విధుల్లో ఉన్న సైనికులు విసిగివేసారిపోయారు. ఇదే సమయంలో యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ యుద్ధనౌకలో అగ్నికీలలు ఎగిసిపడ్డ ఘటనలో కుట్ర కోణం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. సైనికులు ఇంటికి తిరిగి రావాలనే ఆలోచనలో ఇలాంటి చర్యకు పాల్పడి ఉండారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్‌లో అగ్నికీలలు ఎగిసిపడటం సైనిక తిరుగుబాటు అనేది కేవలం పుకారు లేదా ప్రచారం ఎంతమాత్రం కాదు. ఈ వ్యవహారంపై విశ్వసనీయ సమాచారం ఉన్నట్టుగా ది న్యూయార్క్ టైమ్స్, ఫస్ట్‌పోస్ట్, గ్రీక్‌సిటీ టైమ్స్ కథనాలు ప్రచురించాయి. ఇదే విషయంపై అమెరికా నావికాదళం స్పందిస్తూ మార్చి 12న యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్‌లో ఘోర అగ్ని ప్రమాదం జరిగినట్టుగా నిర్ధారించింది. మంటలు ముందుగా నౌక పక్క భాగంలోని లాండ్రీలో మొదలయ్యాయని పేర్కొన్నది. మంటలు 30 గంటల పాటు కొనసాగాయని, మొత్తం 600 మంది సైనికులు నివసించే గదులు దగ్ధమయ్యాయని స్పష్టంచేసింది. అదేవిధంగా దట్టమైన పొగ వల్ల ఇద్దరు సైనికులు గాయపడ్డారని వెల్లడించింది. అమెరికాకు చెందిన యుద్ధనౌకలలో యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ కొత్తది, ఖరీదైనది. దీని విలువ సుమారు 13 బిలియన్ డాలర్లు (రూ.1.1లక్షల కోట్లు). అయితే మంటలు వ్యాపించడానికి ముందుగా గుర్తుతెలియని వ్యక్తులు వాక్యూమ్ టాయిలెట్స్‌ను టీషర్ట్స్, తాళ్లతో మూసివేసినట్టు తెలుస్తున్నది. దీంతో ప్రమాద తీవ్రత పెరిగిందని మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది శ్రమించాల్సి వచ్చిందని వివరించింది. అమెరికా నావికాదళ నేర దర్యాప్తు సంస్థ (ఎన్‌సీఐఎస్) కుట్ర కోణంలో విచారణ చేపట్టింది. నౌకను మరమ్మతుల కోసం గ్రీక్‌కు తీసుకెళ్లాల్సి ఉన్నట్టు అమెరికా నౌకాదళ అధికారులు చెప్తున్నారు. అమెరికా సైనికులు ఇరాన్‌పై ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ సన్నాహాలు జరుగుతున్నప్పటి నుంచి పది నెలలుగా నౌకలోనే ఉన్నారు. నిరంతర ఆజ్ఞలు, హోర్ముజ్ జలసంధి వద్ద క్షిపణి ముప్పు, విధులు పొడగించడం, సెలవులు లేకపోవడంతో సైనికులు తీవ్ర అసహనంతో ఉన్నారు. ఈ తతంగమంతా వదిలేసి ఇంటికి వెళ్లిపోదామనే ఉద్దేశంతో ఉన్నట్టు వాదన వినిపిస్తున్నది. ఇదే విషయంపై ఇరాన్ ప్రసార మాధ్యమాల్లో భయపడ్డ అమెరికన్లు సొంత యుద్ధనౌకను తగలబెట్టుకున్నారు అని కథనాలు ప్రసారమవుతున్నాయి. సైనికుల తీవ్ర అలసటే ప్రధాన కారణమని అమెరికా మీడియావర్గాల్లో వాదన వినిపిస్తున్నది. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం గురించి భారతీయ మీడియాలో చర్చలు జరుగుతున్నాయి. ఇదంతా ఎక్కడో జరుగుతున్న పరిణామాలుగా చూడనక్కరలేదు. ఏ యుద్ధం వల్లనైతే అమెరికా సైనికులు అలసిపోయారో, అదే యుద్ధం మన దేశంలో చమురు, ఎల్పీజీ సిలిండర్ల సరఫరాపై ప్రభావం చూపుతుంది. భారత్ దిగుమతి చేసుకుంటున్న ఎల్పీజీలో 80–85% ఎల్పీజీ, చాలా వరకు ముడి చమురు, ఎల్ఎన్‌జీ గల్ఫ్ నుంచి హోర్ముజ్ జలసంధి మీదుగా దిగుమతి అవుతుంది. దిగుమతికి ఆటంకం ఏర్పడితే యుద్ధం ప్రభావం మన వంట గదులు, ప్రయాణాల మీద కూడా పడుతుంది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌పై అమెరికా దాడులు ప్రారంభించింది. ఇరాన్ అణు ఇంధన కేంద్రాలను ధ్వంసం చేసి, ఆ దేశ నాయకత్వాన్ని తొలగించాలనే లక్ష్యంతో రంగంలోకి దిగింది. గల్ఫ్ దేశాలైన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్‌లో వేలాది మంది అమెరికా సైనికులు ఉన్నారు. కానీ యుద్ధం గురించి అమెరికా తమకు సమాచారం ఇవ్వలేదని ఆయా గల్ఫ్ దేశాలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నాయి. ఇదే నేపథ్యంలో ఇరాన్ జరిపిన క్షిపణి ప్రతిదాడులు గల్ఫ్ దేశాల భూభాగాలను తాకాయి. ఈ దాడుల నుంచి రక్షించుకునేందుకు గల్ఫ్ దేశాలు తమ సొంత రక్షణ వ్యవస్థలను వినియోగించుకోవాల్సి వచ్చింది. అమెరికా మాత్రం కేవలం ఇజ్రాయెల్‌ను రక్షించడంపైనే దృష్టి సారించింది. ఇప్పుడు చాలావరకు గల్ఫ్ దేశాలు ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నాయి. అమెరికా వైఖరి పట్ల ఫిర్యాదు చేస్తున్నాయి. అమెరికా తమను ఒంటరిని చేసి వదిలేసినట్టు చెప్పుకొంటున్నాయి. మరోవైపు యూరోపియన్ యూనియన్ మిత్ర దేశాలు కూడా దాడులు ఆపాలని, చర్చలు జరపాలని కోరుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా మిత్రబలం క్రమంగా తగ్గుతున్నది. విమాన వాహక నౌకలు అమెరికా సైనిక శక్తికి ప్రతీకలు. వీటిలో గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ ఒక కీర్తి కిరీటం వంటిది. అణు ఇంధనంతో నడిచే ఈ యుద్ధనౌక 75 ఫైటర్ జెట్స్‌ను మోసుకెళ్తుంది. ఇందులో 5000 మంది నావికులు ఉంటారు. అమెరికా నిమిట్జ్ క్లాస్ యుద్ధనౌకలైన అబ్రహాం లింకన్, రొనాల్డ్ రీగన్ నౌకలను ఇరాన్ సమీపంలో దశాబ్దాలపాటు మోహరించింది. ఇటీవల మూడు యుద్ధనౌకలను పంపింది. తమను ఎవరూ ఏమీ చేయలేరని, ఓడించడం అసాధ్యమని బలం చాటుకోవడమే అమెరికా ఉద్దేశం. కానీ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ కథనం మరో పాఠం చెప్తున్నది. యంత్రాలు ఎంత శక్తిమంతమైనవైనా, వాటిని నడిపే మనుషులు విసిగిపోతే వ్యవస్థ కుప్పకూలుతుంది. అలాగే అమెరికా సైనికులు బహిరంగంగా తిరుగుబాటు చేయకపోయినా నిశ్శబ్దంగా విధ్వంసానికి పాల్పడినట్టు తెలుస్తున్నది. దీంతో అమెరికా రక్షణ గోడకు ఒక చిల్లు పడిందని నిపుణులు అభివర్ణిస్తున్నారు. అమెరికా సైన్యంలో ఇలాంటి నిశ్శబ్ద తిరుగుబాట్లు ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా సుదీర్ఘ యుద్ధాలు జరుగుతున్నప్పుడు అగ్రరాజ్య సైన్యంలో తిరుగుబాట్లు జరిగాయి. 1960–70లలో వియత్నాం యుద్ధం సమయంలో అమెరికా సైనికులు అలసిపోయి, సొంత సైనిక అధికారులపైనే గ్రనేడ్స్ విసిరారు. 1969–72 మధ్య కాలంలో ఇలాంటి 904 ఘటనలు జరగగా 86 మంది అధికారులు మరణించారు. వియత్నాం యుద్ధం తర్వాత సుదీర్ఘమైన యుద్ధాలు ఉండబోవని, సైనికుల రొటేషన్ పద్ధతి అమలు చేస్తామని అమెరికా ప్రభుత్వం తమ సైన్యానికి చెప్పింది. కానీ మళ్లీ ఇరాక్, అఫ్గనిస్థాన్‌తో సుదీర్ఘ యుద్ధాలు జరిపింది. అమెరికా సైనికులు కొందరు ఆత్మహత్యలు చేసుకోగా, మరికొందరు పారిపోయారు. మళ్లీ ఇప్పుడు గెరాల్డ్ ఆర్.ఫోర్డ్‌లో చెలరేగిన మంటలు ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. యుద్ధంలో జరిగే ప్రాణనష్టాన్ని దేశాల నాయకత్వాలు మర్చిపోతే బలమైన సైన్యాలు, యుద్ధనౌకలు కూడా నిశ్శబ్దంగా తిరుగుబాటు చేస్తాయి.

# ప్రమాదకర పోకడలు

అమెరికా, ఇజ్రాయెల్--ఇరాన్‌ల మధ్య సాగుతున్న యుద్ధంలో రోజూ వందల సంఖ్యలో అమాయక పౌరులు మరణిస్తుంటే నిమ్మకు నీరెత్తినట్టున్న ప్రపంచ దేశాధినేతలు పశ్చిమాసియాలో గత రెండు రోజుల పరిణామాలతో మేల్కొన్నట్టు కనబడుతోంది. చమురు, సహజవాయు క్షేత్రాల పై పరస్పరం చేసుకుంటున్న దాడుల్లో అయిదు దేశాల్లోని ఆరు క్షేత్రాలు తీవ్రంగా దెబ్బతినటమే అందుకు కారణం. దక్షిణ ఇరాన్‌లోని సహజ వాయు క్షేత్రం పార్స్‌ను ఇజ్రాయెల్ గురిచూసి కొట్టిన వెంటనే ప్రపంచంలోనే అతి పెద్ద ఖతార్ సహజవాయు క్షేత్రం రస్ లఫాన్‌పైనా, దాంతోపాటు సౌదీ అరేబియా, కువైట్, ఇజ్రాయెల్ చమురుశుద్ధి కర్మాగారాలపైనా ఇరాన్ దాడులకు దిగింది. ఈ దాడుల వల్ల ఒక్క ఖతార్ సహజవాయు క్షేత్రం రస్ లఫాన్‌లోని 17 శాతం నిక్షేపాలు ఆవిరయ్యాయి. యుద్ధం పరిసమాప్తమయ్యేవరకూ దాన్ని చక్కదిద్దటం అసాధ్యం. ఆ పనులకు దాదాపు అయిదేళ్లు పడుతుందంటున్నారు. అంటే అయిదేళ్ల ఖతార్ ఆదాయం 10,000 కోట్ల డాలర్లు మాయమైనట్టు! దీనివల్ల మన దేశంతో సహా ఆసియా, యూరప్ దేశాలు తీవ్రసంక్షోభంలో చిక్కుకునే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికే బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 116 డాలర్లను దాటింది. అది 130కి చేరిందంటే అమెరికాతోపాటు అందరికీ కష్టాలు మొదలవుతాయి. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పరస్పర విరుద్ధ ప్రకటనలతో నవ్వులపాలవుతున్నారు. ఇరాన్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయెల్ ఇక దాడి చేయబోదని ఆ దేశం తరఫున ఆయన హామీ ఇచ్చారు. మరికొన్ని గంటలకే హార్మూజ్ దిగ్బంధాన్ని ఛేదించేందుకు ఇరాన్‌కు చెందిన ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకునే పథక రచన సాగిస్తున్నట్టు లీకులిచ్చారు. అసలు ఇజ్రాయెల్ తన ఆదేశం పాటిస్తుందని నిజంగా ట్రంప్ భావిస్తున్నారా? అది ఎప్పుడో ఆ స్థితిని దాటిపోయింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ శక్తిమంతమైన సేవకుడిగా మారితే, అమెరికా బలహీనమైన యజమానిగా మిగిలిపోయింది. పశ్చిమాసియాలో 'గ్రేటర్ ఇజ్రాయెల్' ఆవిర్భవించటానికి వీలుగా చుట్టూవున్న ముస్లిం దేశాల్ని పాదాక్రాంతం చేసుకోవాలని 1996లోనే ఇజ్రాయెల్ పథక రచన చేసింది. గత అమెరికా అధినేతల దగ్గర దాని ఎత్తులు పారలేదు. తెలిసీ తెలియని ట్రంప్ ఆ కొరతను తీర్చారు. తమకు క్షిపణులకు



కొరతేమీ లేదని ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రతినిధి అలీ మహమ్మద్ నైనిపై ఇజ్రాయెల్ దాడిచేసి హతమార్చింది. ఇలాంటి చర్యలు యుద్ధ విరమణను జటిలం చేస్తాయి తప్ప సాధించేదేమీ ఉండదు. యుద్ధం నాలుగో వారంలోకి ప్రవేశించిన దశలో కూడా ఆ రెండు దేశాలూ అతిగా అంచనా వేసుకుంటూ, ఇరాన్‌పై తప్పుడు లెక్కలు కడుతున్నాయి. చట్టవిరుద్ధ మైన ఈ యుద్ధానికి మరో 20,000 కోట్ల డాలర్లు కావాలంటూ అమెరికన్ కాంగ్రెస్‌ను పెంటగాన్ అభ్యర్థించింది. ఇప్పటికే అమెరికన్ కుబేరులకు కోట్లాది డాలర్ల పన్ను రాయితీలిచ్చిన ప్రభుత్వం, సాధారణ ప్రజానీకానికి అందే అరకొర సదుపాయాలకు సైతం కోత పెడితే తప్ప ఈ నిధులు సమకూర్చుకోలేదు. ఈ అకారణ యుద్ధానికి ఇన్ని వేల కోట్లు దుర్వినియోగం చేయటం అవసరమా? వీటి సంగతలా ఉంచి అత్యంత అమానవీయ పద్ధతుల్లో కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో ప్రాణాలు తీస్తున్న అమెరికా, ఇజ్రాయెల్ దుశ్చర్యల పర్యవసానాలేమిటో కనబడుతూనే ఉన్నాయి. ఓపెన్ ఏఐ, పాలంటీర్ కలిసి ఆంత్రోపిక్ రూపొందించిన క్లాడ్ ఆసరాతో మారణహోమానికి తోడ్పడుతున్నాయి. పదేళ్లుగా పాఠశాల నడుస్తున్న ఒక ఆవరణను ఏఐ ఇరాన్ సైనిక స్థావరంగా అర్థం చేసుకుని చూపితే, దాని ఆధారంగా అమెరికా క్షిపణి దాడికి పాల్పడి ఒకేసారి 170 మంది బాలబాలికల ప్రాణాలు తీసింది. సైనిక దాడులకోసం తమ సాఫ్ట్‌వేర్ ఇచ్చేది లేదని ట్రంప్‌కు చెప్పిన ఆంత్రోపిక్ అయినా, ఆ కాంట్రాక్టును చేజిక్కించుకుని లాభపడిన ఓపెన్ ఏఐ అయినా సారాంశంలో ఈ ప్రాణాంతక దాడులకు వ్యతిరేకం కాదు. ఆంత్రోపిక్ అభ్యంతరమల్లా ఆ సాఫ్ట్‌వేర్‌మరింత పదునుదేరాలన్నదే. ఆ తర్వాతే అందుబాటులోకి తీసుకురావాలని దానిఉద్దేశం. ప్రపంచ మనుగడ ఎంత ప్రమాదకరంగా మారిందో దీన్నిబట్టే గ్రహించవచ్చు.

# హక్కుల హరణం అన్యాయం

సమస్య ఉందని గుర్తించటం, దానికి పరిష్కారం అన్వేషించటం ఒక ఎత్తయితే అందుకు సంబంధించి చట్టం తీసుకురావటం మరో పెద్ద పని. మన దేశంలో చాలా సందర్భాల్లో అందుకు దశాబ్దాలు పడుతుంది. తీరా ఆ చట్టాన్ని కాస్తా నీరుగారిస్తే...? ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ), చట్టం 2019కి కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన సవరణలు వారికి దక్కిన అరకొర హక్కుల్ని కాస్తా హరించేలా ఉన్నాయి. సృష్టి ఒక గీత గీసిందనీ, ఎవరైనా దానికి అటో, ఇటో ఉండాలి తప్ప వేరేవిధంగా ఉండటానికి వీల్లేదన్నది కాలం చెల్లిన భావన. మన దేశంలో తొలిసారి 2014లో ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల్ని గుర్తించి,వారికి కూడా ఇతరుల్లాగే ప్రాథమిక హక్కులుంటాయని సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఏ సమాజంలోనైనా అత్యధిక సంఖ్యాకుల అభిప్రాయాలే విలువలుగా చలామణిలోకొస్తాయి. ఆడ, మగ కలిసి ఉండటం సహజమనీ, ఇతరమైన సంబంధాలు అసహజమనీ భావించే ధోరణి అటువంటిదే. ప్రభుత్వాలు సైతం ఆ దోవనే పోవటంతో దశాబ్దాలుగా ఎల్‌జీబీటీక్యూ (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్) వర్గాల వారు అడుగడుగునా వివక్ష, అవమానాలు ఎదుర్కోవడం సాధారణ విషయాలుగా మారాయి. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన అయిదేళ్లకు 2019లో ఎట్టకేలకు ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణ చట్టం వచ్చింది. ఆ చట్టం కింద జిల్లా కలెక్టర్‌కు ట్రాన్స్‌జెండర్‌నని దరఖాస్తు చేసుకున్నవారికి ధ్రువీకరణ పత్రం జారీ అయ్యేది. కొత్త సవరణ అలా కుదరదంటోంది. ప్రధాన వైద్యాధికారి లేదా ఉప వైద్యాధికారి ఆధ్వర్యంలో మెడికల్ బోర్డులు ఏర్పడాలనీ, వాటి సిఫార్సుల ఆధారంగానే కలెక్టర్లు ధ్రువీకరణ పత్రాలు జారీచేయాలనీ తాజా సవరణ చెబుతోంది. దీంతోపాటు ట్రాన్స్‌జెండర్ వ్యక్తులపై జరిగే హింస, భిక్షాటన చేయించటం నేరాలుగా పరిగణిస్తూ, కఠిన శిక్షలు నిర్దేశిస్తూ నిబంధనలు పొందుపరిచారు. అసలు జిల్లా కలెక్టర్ స్థాయిలో ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోవటమే పెద్ద సమస్యగా పరిణమిస్తున్నదనీ, ఈ క్రమంలో వేధింపులు ఎదురవుతున్నాయినీ ఆ వర్గాలవారు ఆవేదన పడుతున్నారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లోగా ధ్రువీకరణ ఇవ్వాలన్న నిబంధన ఉన్నా 2023 డిసెంబర్ నాటికి దరఖాస్తుల్లో 65 శాతం మాత్రమే పరిష్కారమయ్యాయని గణాంకాలు



చెబుతున్నాయి. ఈలోగా దాన్ని మరింత జటిలం చేసే సవరణలు వచ్చిపడ్డాయి. చట్టం రూపొందించేటపుడూ లేదా దానికి సవరణలు తీసుకురాదల్చుకున్నప్పుడూ సంబంధిత వర్గాలతో చర్చించటం, అవసరమైన మార్పులు చేర్పులకు సిద్ధపడటం ఒక ప్రజాస్వామిక సంప్రదాయం. సాగు చట్టాలు మొదలుకొని చాలా విషయాల్లో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దాన్ని పక్కనబెడుతోంది. పుట్టుకతో అందరూ గుర్తించిన జెండర్‌కు భిన్నమైన లైంగిక భావనలుండటం ప్రకృతి విరుద్ధం కాదని చెబుతూ స్వలింగసంపర్కాన్ని నేరంగా పరిగణించే సెక్షన్ 277 రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు 2018లో తీర్పునిచ్చింది. ఆ సందర్భంగా అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా 'స్వీయ వ్యక్తీకరణకు అవకాశం లేకపోవటం చావుతో సమానం' అని వ్యాఖ్యానించారు. ఆ వర్గాలవారు అసలే దారుణ వివక్ష ఎదుర్కొంటున్నారు. జాతీయ మానవ హక్కుల నివేదిక, 2018 ప్రకారం వారిలో 92 శాతం మంది ఆర్థిక వెలికి గురవుతున్నారు. అక్షరాస్యత కూడా 56.1 శాతం. జాతీయ సగటు 74 శాతంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. నిరుద్యోగం 48 శాతం. బ్యాంకు ఖాతాలు తెరవాలన్నా అడ్డంకులు. ఇక ఆర్థిక సాయం పొందటం గురించి చెప్పేదేముంది? స్వలింగ సంపర్కం నేరం కాదని మొదటిసారి గుర్తించింది 1791 నాటి ఫ్రెంచ్ విప్లవం సమయంలో. లెనిన్ ఆధ్వర్యంలోని సోవియెట్ ప్రభుత్వం 1920లో స్వలింగసంపర్కుల హక్కుల్ని గుర్తించి చట్టం తీసుకొచ్చింది. ఆ మాత్రం మార్పు రావటానికి ప్రపంచ దేశాల్లో ఎంతకాలం పట్టిందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికీ దాన్ని మహాపాపంగా, నేరంగా పరిగణించే దేశాలు ఎన్నో! ఈ బిల్లుపై పార్లమెంటు చర్చించేలోగా ట్రాన్స్‌జెండర్ వర్గాలను సంప్రదించాలి. చట్టాన్ని మరింత సరళం చేయటం అవసరమని భావిస్తున్న తరుణంలో వారికి వ్యవస్థ ఆమోద ముద్రను తప్పనిసరి చేయటం ధర్మం కాదు.

## సర్వరోగ నివారిణి - నాణ్యమైన నిద్ర

నేటి అత్యాధునిక వేగవంతమైన డిజిటల్ యుగంలో ఒత్తిడి, టెక్నాలజీ, రోజుకు దాదాపు 10 గంటల విధి నిర్వహణ లాంటి సవాళ్ల నడుమ గాఢ నిద్ర ఒక అరుదైన అనుభవం అవుతున్నది. నిద్ర ఒక సాధారణ విశ్రాంతి మాత్రమే కాదు నాణ్యమైన నిద్రతో శారీరక, మానసిక, భావోద్వేగ ఆరోగ్యం సిద్ధిస్తుంది. నాణ్యమైన నిద్ర వల్ల జ్ఞాపక శక్తి, రోగ నిరోధకత, ఉత్పత్తి పెరుగుతాయి. మానవ శారీరక మానసిక ఎదుగుదలకు పునాదిగా మంచి నిద్ర ఉపకరిస్తున్నది. 2008 నుంచి ప్రతి ఏట వసంత కాలంలో సమరాత్రి (రాత్రి పగలు సమాన గంటలు) రోజు, అనగా మార్చి 10 – 20 తారీఖల మధ్య వచ్చే శుక్రవారం రోజున, అనగా 13 మార్చి 2026 రోజున "ప్రపంచ నిద్ర దినోత్సవం(వరల్డ్ స్లీప్ డే)"పాటించడం జరుగుతోంది. ప్రపంచ నిద్ర దినోత్సవ వేదికగా ప్రజల్లో నిద్ర ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు నిద్ర లేమి ఫలితాల వివరణ, ఆరోగ్యకర నిద్ర అలవాట్లు, నిద్ర ప్రయోజనాలు లాంటివి చర్చించడం జరుగుతున్నది. మంచి నిద్ర ద్వారా వ్యక్తుల నిర్ణయం తీసుకునే సామర్థ్యం, పనిలో ఏకాగ్రత, ఉత్తమ ఉత్పత్తి లాంటి ప్రధాన ప్రయోజనాలు వస్తాయి. నాణ్యమైన నిద్రతో భావోద్వేద నియంత్రణ, స్థిరమైన మానసిక స్థితి, ఒత్తిడి లేమి, సమస్యల పరిష్కార సామర్థ్యం, చురుకైన శారీరక కదలికలు, సరైన జీర్ణక్రియ, సక్రమ జీవక్రియలు, కండరాల రిపేర్, హార్మోన్ల ఉత్పత్తి, సరైన బిపీ, హృద్రోగాల కట్టడి లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. నిద్ర వల్ల శరీర అవయవాలన్నీ విశ్కడరాంతి తీసుకుంటాయనే అభిప్రాయం సరైనది కాదు. వ్యక్తి నిద్రలో ఉన్నపుడు తన శరీర అవయవాలు, మెదడు చురుకుగా పని చేస్తూ మన సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఉత్పాదకత, భావోద్వేగ సమతాస్థితి ఒనగూడుతాయి. ఒక సాధారణ వయోజనుడు ప్రతి రోజు 7 – 9 గంటలు నిద్ర పోవడం జరుగుతుంది. పని ఒత్తిడిలో తరుచుగా నిద్రకు సరైన సమయం కేటాయించని యెడల నిద్రలేమి వల్ల ప్రాణాంతక వ్యాధులు కూడా అనుభవించాల్సి వస్తుందని తెలుసుకోవాలి. ప్రపంచ నిద్ర దినోత్సవం వేదికగా నిద్ర ప్రాధాన్యతను ప్రచారం చేయడంతో పాటు నిద్రలేమి దుష్ఫలితాలను వివరించడం జరుగుతుంది. నిద్రతో ఆరోగ్యానికి ఉన్న ప్రత్యక్ష సంబంధాలను వివరించడం, నిద్ర కేంద్రంగా సెమినార్ల నిర్వహణ, నిద్ర పట్ల లోతైన పరిశోధనల అవసరం, నిద్ర లేమి సవాళ్లు, సడలింపు పద్దతులు, ఉత్పాదకతకు చేయూత, నాణ్యమైన జీవనశైలి పాటించడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది. ఒక నిష్కల్మష నవ్వు, నాణ్యమైన నిద్ర అనేవి అనేక రోగాల నివారణకు ఉత్తమ ఔషధాలని భావించాలి. నిద్ర అనేది ఒక రకమైన ధ్యానం లాంటిది.

# కాంగ్రెస్ కు భారీ షాక్!

**25న జీవన్ రెడ్డి రాజీనామా!**
**సొంత పార్టీలో అన్యాయం జరిగిందని ఆవేదన**
**27 నుండి 'గ్రామాల బాట' కార్యక్రమం**
**పార్టీ మార్పుపై ప్రజల అభిప్రాయం సేకరించి భవిష్యత్ నిర్ణయం**

**అగ్నిధార న్యూస్ ,( హైదరాబాద్):** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగలనుంది. పార్టీలో సీనియర్ నాయకుడు, శాసనమండలి మాజీ సభ్యుడు తాటిపర్తి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నెల 25వ తేదీన ఆయన అధికారికంగా తన రాజీనామా లేఖను సమర్పించనున్నారు. పార్టీలో తనకు జరుగుతున్న అన్యాయం పట్ల అసంతృప్తితో ఉన్న ఆయన, ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### పార్టీలో తీవ్ర అన్యాయం:

గత కొద్ది కాలంగా జీవన్ రెడ్డి పార్టీలో అసంతృప్తిగా ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పార్టీ నిర్ణయాలు, కొన్ని నియామకాలు ఆయనకు నచ్చడం లేదని సమాచారం. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో ఆయనకు తగిన ప్రాధాన్యం లభించడం లేదని, కొన్ని వర్గాలు ఆయనను పక్కన పెడుతున్నాయని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఆయన పలుమార్లు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా, ఫలితం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారని సమాచారం. ఈ క్రమంలోనే ఆయన పార్టీకి రాజీనామా చేయాలనే కఠిన నిర్ణయం తీసుకున్నారు.

### 27 నుండి గ్రామాల బాట:

రాజీనామా అనంతరం, ఈ నెల 27వ తేదీ నుండి జీవన్ రెడ్డి 'గ్రామాల బాట' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన వివిధ గ్రామాలను సందర్శించి, ప్రజలతో ముఖాముఖి మాట్లాడనున్నారు. తనకు పార్టీలో జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించి, వారి అభిప్రాయాలను సేకరించనున్నారు. ప్రజల స్పందనను బట్టి, పార్టీ మార్పుపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

### ప్రజాభిప్రాయ సేకరణే కీలకం:

జీవన్ రెడ్డి గ్రామాల బాట కార్యక్రమం చాలా కీలకంగా మారనుంది. ప్రజలు ఆయనకు మద్దతు ఇస్తే, ఆయన కొత్త పార్టీలోకి చేరడం ఖాయం. అయితే, ప్రజలు ఆయనకు మద్దతు ఇవ్వకపోతే, ఆయన భవిష్యత్ రాజకీయాలు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, గ్రామాల బాట కార్యక్రమంలో ప్రజల స్పందనపై అందరి దృష్టి నెలకొంది.

### తెలంగాణ రాజకీయాల్లో అలజడి:

జీవన్ రెడ్డి రాజీనామా తెలంగాణ రాజకీయాల్లో అలజడి సృష్టించింది. సీనియర్ నాయకుడైన ఆయన రాజీనామా కాంగ్రెస్ పార్టీకి పెద్ద లోటుగా పరిణమించనుంది. అలాగే, ఇతర పార్టీలకు జీవన్ రెడ్డిని ఆకర్షించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, తెలంగాణ రాజకీయాల్లో రానున్న రోజుల్లో మరిన్ని మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది.

### తుది నిర్ణయం:

జీవన్ రెడ్డి గ్రామాల బాట కార్యక్రమం అనంతరం, పార్టీ మార్పుపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి, వారి మద్దతుతో ముందడుగు వేస్తామని ఆయన చెబుతున్నారు. తెలంగాణ రాజకీయాల్లో జీవన్ రెడ్డి భవిష్యత్ ఏమవుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# జర్నలిస్టుల ప్రస్తావన లేని బడ్జెట్

**జర్నలిస్టుల సంక్షేమానికి నిధుల కేటాయించనీ ప్రభుత్వం**
**జర్నలిస్టుల ఇంటి స్థలాలపై నాన్చి వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**
**అన్ని జర్నలిస్టు సంఘాలు ఆందోళనలకు సిద్ధం కావాలి**
**ఆమనగల్ టిడబ్ల్యూజేఎఫ్ బ్లాక్ సీనియర్ సభ్యులు కాలే శేఖర్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క అసెంబ్లీలోని ప్రవేశపెట్టిన 2026 -27 వార్షిక బడ్జెట్ లో జర్నలిస్టులకు సంబంధించి ఎలాంటి ప్రస్తావనే లేదని, అసలు జర్నలిస్టుల సంక్షేమానికి నిధుల కేటాయింపు చేయలేదని ఆమనగల్ టిడబ్ల్యూజేఎఫ్ బ్లాక్ సీనియర్ సభ్యులు కాలే శేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సమాచార శాఖ ను ప్రభుత్వం మరిచి పోయిందన్నారు. మీడియా అకాడమీ గురించి బడ్జెట్లో ఏమి చెప్పలేదని బడ్జెట్ లో నిధులను కేటాయించకుండా జర్నలిస్టులకుసంక్షేమ కార్యక్రమాలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇండ్ల స్థలాల గురించి కూడా ఏమీ ప్రస్తావించలేదని ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత జర్నలిస్టులకు ఎలాంటి ప్రయోజనం చేకూరాలేదన్నారు. కనీసం అక్రిడిటేషన్ కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు యేండ్లుగా గడువును పొడిగించుకుంటూ పోతున్న ప్రభుత్వంజర్నలిస్టు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వాలని జర్నలిస్టుల సంఘాలు కోరినా సర్కార్ స్పందించ లేదన్నారు. వేలాది మంది జర్నలిస్టులు బడ్జెట్ పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఉత్తమ జర్నలిస్టు అవార్డు ల ప్రస్తావనే లేదన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాజం దృష్టికి తీసుకుపోతున్న మీడియా పట్ల పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్స్, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మహిళా జర్నలిస్టుల సమస్యలపై బడ్జెట్ లో రేఖామాత్రంగా కూడా ప్రస్థావించిక పోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర బడ్జెట్లో కనీసం జర్నలిస్టుల సంక్షేమంపై ప్రస్తావించని ప్రభుత్వం జర్నలిస్టులకు ఇంటి స్థలాల విషయంలో ఈ రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనాన్చివేత ధోరణికి పాల్పడుతున్నాడని విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్లో జర్నలిస్టుల సంక్షేమానికి కేటాయించ కపోవడంపై ఇప్పటికైనా రాష్ట్రంలోని అన్ని జర్నలిస్టుల సంఘాలు ఆలోచించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఆందోళన చేసేందుకు ఐక్యమవ్వాలని జర్నలిస్టుల సంఘాల నాయకులను తెలపడం జరిగింది.

# గురు శిష్యుల బంధం గుర్తుండి పోవాలా- బి ఎల్ ఎన్ మూర్తి

**అగ్నిధార న్యూస్ వనపర్తిజిల్లా:**

వనపర్తి స్థానిక రాణి లక్ష్మీదేవి అమ్మ డిగ్రీ కాలేజ్ 1980-83 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఎస్ఎల్వి గార్డెన్‌లో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆనాటి అధ్యాపకులు బిఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ నాటి మా విద్యార్థులు నేడు సమాజంలో స్ఫూర్తినియ్యడంసంతోషకరమని,నాటికంటే నేడు గురు శిష్యుల బంధం బలపడిందని, గురు శిష్యుల బంధం జీవితకాలం గుర్తుండి పోతుందని ఆయన అన్నారు. అధ్యాపకులు సిద్ధిరామిరెడ్డి, శివరామకృష్ణ, అనంతరెడ్డి, దశరథ రాములు, కృష్ణయ్య తదితరులు హాజరై పూర్వ విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ, నాడు తాము విద్యార్థులకు పాఠాలు బోధించగా, నేడు వారు సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలిచి తమకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. గురు-శిష్య సంబంధం కాలానుగుణంగా మరింత బలపడిందని తెలిపారు. నాటి కాలంలో ఉన్న సరళ జీవన విధానం, పరస్పర గౌరవం, విలువలు నేటి ఆధునిక జీవన శైలి మధ్య ఉన్న తేడాలను వివరిస్తూ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు తమ కాలేజ్ రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సమ్మేళనం పాత స్నేహాలను మరింత బలపరిచే వేదికగా నిలిచింది. కార్యక్రమం ఆనందభరిత వాతావరణంలో సాగింది.

# వనపర్తి జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా

**అగ్ని ధార న్యూస్ వనపర్తి జిల్లా :**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర), వనపర్తి 1975--76 విద్యాసంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఎంవైఎస్ బ్యాంకెట్ హాల్‌లో స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. దాదాపు 50 సంవత్సరాల అనంతరం సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు ఒకేచోట కలుసుకొని జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సమ్మేళనానికి మాజీ ఉపాధ్యాయులు సోమసుందరం, విజయకుమార్ హాజరై విద్యార్థులతో అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఇద్దరు ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే స్వర్ణోత్సవ సంవత్సరం సందర్భంగా ప్రతి విద్యార్థికి మెమెంటో, గ్రూప్ ఫోటోలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని కాగితాల మనోహర్, కలకొండ ప్రకాష్, సుదర్శన్ రెడ్డి, బండారు కుమారస్వామి, భగవంజి, వెంకటస్వామి, ఎల్లస్వామి తదితరులు నిర్వహించారు.

# గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తా



**సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామంలో ఈజీఎస్ నిధుల ద్వారా 5,00,000 లక్షల రూపాయలతొ పనులు ప్రారంభించిన సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి ,ఈ సందర్భంగా సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో అన్ని వీధుల్లో రాబోయే రోజుల్లో సిసి రోడ్లు నిర్మించేలా శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు గ్రామంలో డ్రైనేజీ వీధి దీపాలు సిసి రోడ్లు అధికప్రాధాన్యతమిస్తున్నామన్నారు గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన విజ్ఞప్తి చేశారు ప్రతి పౌరుడు బాధ్యతయుతముగ నడుచుకున్నప్పుడే మంచి సమాజం నిర్మాణం జరుగుతుందని అందరి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ భూత్కూరు వెంకటరెడ్డి, వార్డు సభ్యులు జంగయ్య, శేఖర్, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ తిరుపతయ్య, మాజీ వార్డ్ సభ్యులు భాస్కర్ రెడ్డి ,మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ ,జగన్మోహన్ రెడ్డి ,ఎలమందరెడ్డి, జైపాల్ రెడ్డి ,యాదిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, వెంకటయ్య, రాములు, రాజేష్ ,ప్రమోద్, రాజు, రబ్బానీ, సాయిలు, తదితరులు పాల్గొనడం జరిగింది.

# పేద ప్రజల వరం ముఖ్యమంత్రి సహాయ నిధి



**సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో చెక్కు అందజేత**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కడ్తల్ మండలంలోని గోవిందా పల్లి తండా కి చెందిన కేతవత్ రాములు తండ్రి జేమ్లా అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోనీ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడం జరిగింది. మంజూరైన 18 వేల రూపాయల చెక్కు బాధితునికి అందజేయడం జరిగింది. ఈ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఐక్యత పౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ,రమేష్, భాస్కర్, సికిందర్, ప్రేమ్, గణేష్,మల్లేష్, శ్రీరామ్, శ్రీను,నరేష్, గోపి, హరి, ఆకాష్, పరమేశ్, వినోద్, బబ్లూ,

# గ్రామ ప్రజలకు ఆదర్శగా నిలిచిన పెంచికల్ పేట్ గ్రామ సర్పంచ్

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

సోలార్ ప్యానెల్ లు ఉపయోగించి మన ఇంటి మీదనే సౌర విద్యుత్ ఉత్పత్తి చేసిన ప్రక్రియను ప్రోత్సహించడంలో పెంచికల్ పేట్ గ్రామ సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ గారు కృషి చేస్తున్నారు. ఈ సోలార్ విద్యుత్ ఉత్పత్తి గురించి అవగాహన కోసం పెంచికల్ పేట్ సర్పంచ్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రతి గృహానికి విద్యుత్ సరఫరా మెరుగవడంతో పాటు, మన్నికైన, పర్యావరణ అనుకూలమైన శక్తి ఉత్పత్తి అవుతుంది. సోలార్ ప్యానల్ ఏర్పాటు ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు విద్యుత్ అవసరాలు తీర్చే ఆదాయం సమకూర్చుకోవచ్చు అని అదేవిధంగా సూర్య శక్తిని ఉపయోగించడం వల్ల విద్యుత్ బిల్లు తగ్గడం, ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం పర్యావరణం కాపాడటానికి ప్రతి ఇంటికి సోలార్ అవసరం అని మరియు ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి ప్రజల భాగస్వామ్యం, అవగాహన, మద్దతు అవసరం అని తెలిపారు.

## కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

**ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ నేతల జాయిన్**

**అగ్ని ధార న్యూస్ ,(పాలకుర్తి):** రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజ్ ఠాగూర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, మనాలి రాజ్ ఠాగూర్ ఆధ్వర్యంలో పాలకుర్తి మండలం తక్కలపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వారిలో మెరుగు లక్ష్మయ్య (మాజీ వార్డ్ మెంబర్), సంతపురి లింగమూర్తి (వార్డ్ మెంబర్), నెరవేట్ల అశోక్ (వార్డ్ మెంబర్), నెరవేట్ల చంద్రయ్య, సంతపురి సంజీవ్, బాలసాని వెంకట నాని తదితరులు ఉన్నారు. వీరు ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ చేపడుతున్న అభివృద్ధి పనులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మనాలి రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ, ఐక్యంగా పని చేస్తేనే రామగుండం నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. పాలకుర్తి మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం తిరుపతి, యువజన కాంగ్రెస్ నాయకులు వాసుదేవరావు, తుంగ నరసయ్య, బొమ్మన నారాయణ, వార్డ్ మెంబర్ నరేందర్, యువ నాయకుడు తిరుమల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామలో ఘనంగా కామాక్షిదేవి బ్రహ్మోత్సవాలు

**ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన మనాలి ఠాకూర్**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జనగామ గ్రామంలో వెలసిన శ్రీ కామాక్షిదేవి సమేత ఏకామ్రేశ్వర స్వామి వారి కళ్యాణ బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆలయానికి విచ్చేసిన మనాలి ఠాకూర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె అమ్మవారు మరియు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత జరిగిన హోమ కార్యక్రమంలో పాల్గొని దేవుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల నిర్వహణకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని మనాలి ఠాకూర్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ తోడ్పాటునిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మనాలి ఠాకూర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రంజాన్ సందర్భంగా చిరు వ్యాపారులకు తోఫాలు

**మక్కాన్ సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని రామగుండంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మార్గదర్శకత్వంలో మక్కాన్ సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో ముస్లిం చిరు వ్యాపారస్థులకు రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి చైర్మన్ మనాలి ఠాకూర్ లక్ష్మీనగర్, శివాజీనగర్ ప్రాంతాల్లోని ముస్లిం వ్యాపారులకు తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ మాట్లాడుతూ, రంజాన్ పండుగ సామరస్యానికి, పరస్పర గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండి పండుగలను ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారా సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సేవాసమితి సభ్యులు, ముస్లిం సోదరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## లైసెన్స్ సర్వేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

**ఏకగ్రీవంగా కొత్త కమిటీ ఎంపిక**
**సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని కోరిన నాయకులు**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):** పెద్దపల్లి జిల్లాలో లైసెన్స్ పొందిన సర్వేయర్లు శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు అందుకున్న అనంతరం, జిల్లా స్థాయి వెల్ఫేర్ అసోసియేషన్ కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సాతురి అనిల్, ప్రధాన కార్యదర్శిగా వెల్పుల తిరుపతి ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.డి. జుబేర్, బూర్ల సురేష్, కోశాధికారిగా సన కుమార్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ప్రతినిధులుగా కొత్త వర్కింగ్ కమిటీని కూడా ఎంపిక చేశారు. వీరిలో కొత్తె వంశీ, బి. భారతీ, ఎన్. వెంకటేష్, మేథు సురేష్ గోపి (సిరంపూర్), ఎం. మహేష్ (ఓదెల), పోలవరం వెంకటేష్, గంధం హర్ష (సుల్తానాబాద్), పోయిల లక్మన్ (మంథని), గుమ్మడి శ్రీనివాస్ (కాంపూర్), దొడ్ల సాగర్ (జూలపల్లి), ఎంచర్ల సతీష్ (రామగిరి), అక్కుకూరి అభిలాష్ (రామగుండం), వెల్పుల హరీష్ (ధర్మారం), బండారి తేజ (ఎలిగేడు), గోనే అభిషేక్ (అంతర్గాం) తదితరులు ఉన్నారు. అదేవిధంగా మహిళా ప్రతినిధులుగా తోట శ్యామల (సిరంపూర్), మెకల సంధ్య (రామగుండం), జి. సరోజిని (రామగుండం), జోనా వనిత (రామగుండం) ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, జిల్లాలో లైసెన్స్ సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. సర్వేయర్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా వ్యాప్తంగా సర్వేయర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్త కమిటీకి మద్దతు తెలిపారు.

## అగ్నిప్రమాద బాధితుడికి సహాయం చేయాలి

**విప్ విజయరమణరావుకు విశ్వబ్రాహ్మణ సంఘం వినతి**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):** అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన విశ్వబ్రాహ్మణ కుటుంబాన్ని ప్రభుత్వం తరపున ఆదుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావుకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు కట్ట రాజానందం మాట్లాడుతూ, ఓదెల మండలం పొత్కపల్లి గ్రామానికి చెందిన పుప్పాల రమేష్ అనే వడ్రంగి కార్మికుడి కార్పెంటర్ షాప్ అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. ఈ ఘటనలో టేకు కలపతో పాటు పలు యంత్రాలు కాలిపోవడంతో రూ.15 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. కష్టపడి కర్ర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రమేష్ కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని, అధికారులు స్పందించి తక్షణ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం, పునరావాసం కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణరావును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాధితుడు పుప్పాల రమేష్, ప్రధాన కార్యదర్శి నాగవెళ్ళి శ్రీమన్నారాయణ, ముఖ్య సలహాదారు కందుకూరి ప్రకాశరావు, కార్యదర్శి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువకుల రక్తదానం..

**.అగ్నిధరా న్యూస్ గోదావరిఖని టౌన్ మార్చి 22**

గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న రోగులకు యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కటుకు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా సోషల్ మీడియాలో రక్తదానం చేయాలని పోస్ట్ చేయడంతో సుమారు 50 మంది యువకులు స్పందించి ముందుకు వచ్చి రక్తదానం చేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. రక్తదానం చేసిన వారికి వైద్య సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# అడుగంటి పోతున్న అడ



**కుమ్రం భీం ఆసిఫాబాద్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని కుమ్రం భీం ప్రాజెక్టు అడుగంట పోతున్నది. 45,500 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు సామర్థ్యం 10 టీఎంసీలు కాగా, ప్రస్తుతం రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. ఎండలు మరింత ముదిరితే డెడ్‌స్టోరేజీకి చేరుకునే అవకాశముండగా, తాగు నీటికి సైతం ఇబ్బందులు తలెత్తే అవకాశమున్నది.

**ఇక ఎండలు ముదిరితే అంతే..**

కుమ్రం భీం (అడ) ప్రాజెక్టును 10 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్-టీ నియోజవర్గాల్లోని 45,500 ఎకరాలకు సాగు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం ఎండలు తీవ్రం కావడంతో ప్రాజెక్టులో రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. ఎండలు మరింత ముదిరితే నీటి నిల్వలు మరింత తగ్గే అవకాశముండగా, తాగు నీటికి సైతం ఇబ్బందులు తలెత్తే ప్రమాదమున్నది. మూడేళ్ల క్రితం ప్రాజెక్టు కట్టకు పగుళ్లు తేలడంతో ప్రాజెక్టులో నీటి నిల్వలను అధికారులు తగ్గించారు.

**ప్రాజెక్టు మనుగడకే ముప్పు**

జిల్లాలోనే పెద్ద ప్రాజెక్టుగా పేరున్న కుమ్రం భీం ప్రాజెక్టు (అడ ప్రాజెక్ట్)కు ఈ ఏడాది కూడా మరమ్మతులు చేయకపోవడంతో నీటి సామర్థ్యాన్ని తగ్గించాల్సి వస్తున్నది. మూడేళ్లుగా కట్టకు ఏర్పడిన పగుళ్లు పెరుగుతూ వస్తున్నాయి. మూడేళ్లుగా వర్షాకాలంలో ప్రాజెక్టు కట్ట కొట్టుకుపోకుండా.. వర్షపు నీరు నేరుగా కట్టపై పడకుండా పాలిథిన్ కవర్లు కప్పి ఉంచుతున్నారు. కానీ, ప్రాజెక్టు కట్టకు సన్నగామొదలైన పగుళ్లు.. క్రమంగా పెద్ద బీటలుగా మారుతున్నాయి. కట్టపై వేసిన తారు రోడ్డుకు సైతం బీటలు వస్తుండటం, కట్టకు రక్షణగా నిర్మించిన సైడ్ వాల్స్ వరద తాకిడికి ధ్వంసం కావడంతో క్రమంగా కట్ట బలహీనంగా మారుతున్నది. ప్రభుత్వం మాత్రం మరమ్మతుల కోసం నిధులు కేటాయించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ప్రాజెక్టు మనుగడకే ముప్పు వాటిల్లే అవకాశమున్నది. ఈ ప్రాజెక్టు ఎంతోకాలం నిలువదేమోనన్న సందేహాలు కలుగుతున్నాయి.

**నివేదికలు పంపినా..!**

అడ ప్రాజెక్ట్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రాజెక్టు మరమ్మతులకు రూ. 5 కోట్లు అవసరమవుతాయని నీటి పారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించినప్పటికీ ఎలాంటి స్పందన రావడం లేదు. గత వానకాలంలో ప్రాజెక్టులోకి వరద రాగా, ఎప్పటికప్పుడు గేట్లు ఎత్తి వదిలేయడం వల్ల ఆనకట్ట తాత్కాలికంగా నిలిచింది. కట్ట మట్టి కొట్టుకుపోకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పి అధికారులు రక్షించే చర్యలు తీసుకున్నారు. కానీ.. రోజులు గడిచిన కొద్దీ కట్ట కుంగిపోతూనే ఉన్నది. వచ్చే వానకాలం నాటికి ప్రాజెక్టు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**డెడ్‌స్టోరేజీకి..!**

అడ ప్రాజెక్టు మరమ్మతులకు సర్కారు నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కింద 5 వేల ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతున్నది. ఇక ప్రాజెక్టు కట్ట కూలిపోతే నీటిని నిల్వ చేసే అవకాశాలు తక్కువ.. ఇక అప్పుడు పంటలు సాగు చేయడం కష్టమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎండలు దంచికొడుతుండగా.. మరికొన్ని రోజుల్లో ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరుకునే అవకాశమున్నది. అదే జరిగితే ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# ఇక కాంగ్రెస్‌లో ఉండలేను..

## పార్టీ వీడటానికి కారణాలపై జీవన్ రెడ్డి లేఖ



కాంగ్రెస్‌తో సుదీర్ఘ ప్రయాణానికి జీవన్ రెడ్డి గుడ్ బై చెప్పారు. ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. ఈ మేరకు పార్టీని వీడటానికి గల కారణాలపై లేఖను విడుదల చేశారు. గత 20 నెలలుగా మానసిక క్షోభను అనుభవిస్తున్నానని జీవన్ రెడ్డి తెలిపారు. అవమానాలు భర్తిస్తూ కాంగ్రెస్‌లో ఉండలేనని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా నాతో కలిసి ప్రయాణం చేసిన రాజకీయ సహచరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులను ఉద్దేశించి జీవన్ రెడ్డి లేఖ రాశారు. గత 20 నెలలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న పరిణామాలను మీరంతా గమనిస్తున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఇంకా అవమానాలకు గురవుతూ.. మానసిక క్షోభతో కాంగ్రెస్ పార్టీలో కొనసాగడం సాధ్యం కాదని అన్నారు. భవిష్యత్ ప్రణాళికపై మార్చి 25వ తేదీన నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఇందుకోసం జగిత్యాల పట్టణం గొల్లపల్లి రోడ్డులోని బండారి గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేశానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాల్గొని మీ సూచనలతో పాటు, రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, అండదండలతో, మానసిక స్థైర్యం కలగిస్తూ మార్గదర్శకంగా నిలవాలని కోరారు. ఇక ఈ నెల 27వ తేదీ నుంచి జీవన్ రెడ్డి గ్రామాల బాట కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో తనకు జరిగిన అన్యాయం గురించి ప్రజలకు వివరించి, పార్టీ మార్పుపై ప్రజాభిప్రాయం సేకరించనున్నారు. కాగా, మంత్రులు చెప్పినా, హైకమాండ్ వద్దన్నా జీవన్ రెడ్డి రాజీనామాకే సిద్ధపడ్డారు. నిన్న రాష్ట్ర మంత్రులు జీవన్ రెడ్డిని కలిసి బుజ్జగించే ప్రయత్నం చేశారు. కానీ, ఆయన తన మనసులోని మాటను వారికి స్పష్టంగా తెలియజేశారు. సారీ.. శ్రీధర్. ఆత్మాభిమానం చంపుకొని, గౌరవాన్ని వదులుకొని కాంగ్రెస్‌లో కొనసాగలేను. మీకో దండం. మీ పార్టీకో దండం. ఇంతదూరం వచ్చి నన్ను కలిసినందుకు ధన్యవాదాలు. పార్టీలో కొనసాగడం మాత్రం ఇక జరిగే పనికాదంటూ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి మంత్రులకు స్పష్టంచేశారు. మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మె ల్యే మేడిపల్లి సత్యం శనివారం జగిత్యాలలోని జీవన్‌రెడ్డి నివాసానికి వచ్చి గంటకుపైగా ఆ యనతో చర్చలు జరిపారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, 20 నెలల క్రితం సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో జీవన్‌రెడ్డికి ప్రాధాన్యత తగ్గిపోవడం, పార్టీ ఫిరాయించి వచ్చిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు అధిష్ఠానం, సీఎం రేవంత్ మద్దతు పలుకడం తో జీవన్‌రెడ్డి మానసిక వేదనకు గురవుతూ వస్తున్నారు.

## హరీష్ రావు కృషివల్లే ఈ-ఆయిల్ ఫామ్ కర్మాగారం

**బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పొనగంటి శ్రావణ్ కుమార్**

**హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం**



**హుజురాబాద్ :** సిద్దిపేటలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్న ఈ ఆయిల్ ఫామ్ అనేది మాజీ మంత్రి హరీష్ రావు కృషివల్లే నిర్మాణం జరిగిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పొనగంటి శ్రావణ్ కుమార్ అన్నారు. ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. హరీష్ రావు కృషి ఫలితంగా ఏర్పాటైన ఆయిల్ ఫామ్ కర్మాగారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించడమంటే అది ఏంటో ఆలోచించాలన్నారు. పామాయిల్ మొక్కలను పెంచేందుకు రైతులు ముందుకు రాకపోవడంతో స్వయంగా వారి వద్దకు వెళ్లి నేనున్నానంటూ హామీ ఇచ్చి పామాయిల్ సాగును చేయించారని గుర్తు చేశారు. పేద ప్రజల ఇండ్లు కూలగొట్టడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ 420 ప్రభుత్వాన్ని, పార్టీని బొంద పెట్టే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. కూలగొట్టడం, చెడగొట్టడం తప్ప ఈ ప్రభుత్వానికి నిర్మాణాలు గానీ, ఆవిష్కరణలు గానీ చేసే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోపే హామీలు నెరవేరుస్తామని, డబ్బాలు కొట్టిన ఈ చేతగాని ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు గడిచిన అమలు చేయడం లేదని వాపోయారు.

## పెళ్లిళ్లకు, విహారయాత్రలకు అద్దెకు ఆర్టీసీ బస్సులు..

## కోరుట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్

**కోరుట్ల :** పెళ్లిళ్లకు, విహారయాత్రలకు, పుణ్యక్షేత్రాల సందర్శనకు అతి తక్కువ ధరలకే అద్దెకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని కోరుట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ కోరుట్ల పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకొని క్షేమంగా వెళ్లి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం, సుఖవంతం, శుభప్రదమని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ ఆర్టీసీని ఆదరించి సంస్థ పురోగతికి సహకరించాలని కోరారు. ఆర్టీసీ అద్దె బస్సుల బుకింగ్ కోసం 9963961503, 9440485576 సెల్ నెంబర్ల లో సంప్రదించాలని డీఎం సూచించారు.

## తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్

## కార్యదర్శిగా ఐలయ్య

**చిగురుమామిడి :** తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన డాక్టర్ బొల్లి ఐలయ్య ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెలక్షన్లో మలయాళ రామస్వామి స్టేట్ ప్రధాన కార్యదర్శి, స్టేట్ కరాటే కోశాధికారి మల్లికార్జున్ గౌడ్, సీనియర్ కరాటే మాస్టర్ రాపోలు సుదర్శన్ చేతుల మీదుగా జిల్లా కార్యదర్శిగా నియామక పత్రాన్ని ఆయన ఆదివారం స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డాక్టర్ బొల్లి ఐలయ్య మాట్లాడుతూ కరాటేలో 20 సంవత్సరాలుగా తను చేసిన సేవలను గుర్తించి నియామకం చేసినట్లు ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## అసెంబ్లీలో ప్రైవేటు బిల్లును ఆమోదించాలి..

## మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**గంగాధర :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు ఆధ్వర్యంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టే ప్రైవేటు బిల్లును ప్రభుత్వం ఆమోదించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసం చేసేలా ఉందని ఎద్దేవా చేశారు. గంగాధర మండలంలోని మధురానగర్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏ వర్గానికి అనుకూలంగా లేదన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ నేతల తీవ్ర విమర్శలు

**అంకెల గారడీతో ప్రజలను మోసం చేసిన బడ్జెట్**

**కొప్పుల ఈశ్వర్**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, పుట్ట మధుకర్ కలిసి నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బడ్జెట్‌పై మండిపడ్డారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసే విధంగా ఉందని, తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్‌గా అభివర్ణించారు. సంక్షేమ పథకాలకు గండికొట్టి, స్కాంలకు ప్రోత్సాహం ఇస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో రూ.3,24,234 కోట్ల అంచనాలు చూపించినప్పటికీ, ఇది అంకెల గారడీ తప్ప మరేమీ కాదన్నారు. రాష్ట్ర సొంత పన్నుల రాబడి కూడా తగ్గిందని ప్రభుత్వం స్వయంగా అంగీకరించిందని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని, గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.56,083 కోట్లను ఈసారి రూ.50,713 కోట్లకు తగ్గించిందని తెలిపారు. మహాలక్ష్మి పథకం, యువతులకు స్కూటీలు వంటి హామీలకు సరైన నిధులు కేటాయించలేదని విమర్శించారు. వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించడంతో రైతులకు నష్టం జరుగుతుందని, రైతు భరోసా నిధులు పెంచకుండా అదే స్థాయిలో ఉంచడం నిరాశ కలిగించిందన్నారు. ధాన్యానికి బోనస్ హామీ కూడా పూర్తిగా అమలు కాలేదని ఆరోపించారు. గురుకుల పాఠశాలలు, గృహజ్యోతి, బీమా పథకాలు వంటి అనేక అంశాల్లో ప్రభుత్వం స్పష్టత లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. దళితుల కోసం ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం పథకానికి కూడా నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టామని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో తెలంగాణ వెనుకబడుతోందని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కిడ్నీ వ్యాధితో పోరాడి.. కన్నుమూసిన 'సిరి'

**చదువుల తల్లి అకాల మరణం.. కృష్ణా నగర్‌లో విషాదం**

**సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. నగేష్ దిగ్భ్రాంతి**

**అగ్ని ధార న్యూస్, ( రామగుండం):**

విధి ఆ చిన్నారిపై పగబట్టింది.. చదువుల్లో మేటిగా రాణిస్తున్న ఆ బాలికను మృత్యువు కబళించింది. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో పోరాడుతున్న కునారపు పోచం పెద్ద కుమార్తె సిరి (17) ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది.

**కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం:** సిరిని కాపాడుకునేందుకు ఆమె తల్లిదండ్రులు పడరాని పాట్లు పడ్డారు. అప్పులు చేసి రాష్ట్రంలోని ప్రముఖ ఆసుపత్రులన్నీ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. పాఠశాలలో ఎన్నో ర్యాంకులు సాధించి అందరి ప్రశంసలు అందుకున్న సిరి మరణవార్త తెలియగానే కృష్ణా నగర్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మధ్యాహ్నం చిన్నారి భౌతిక కాయాన్ని స్వగృహానికి తీసుకురానుండటంతో ఆ ప్రాంతమంతా కన్నీటి పర్యంతమవుతోంది. డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ సంతాపం:సిరి మృతి పట్ల సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ కూడా చదువులో విశేష ప్రతిభ కనబరిచిన సిరిని కోల్పోవడం బాధాకరమన్నారు. ఆ చిన్నారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, పుత్రశోకంతో ఉన్న ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## గోదావరిలో వినూత్న నిరసన

**సీఎం చిత్రపటానికి పిండప్రదానం**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం):**

గోదావరి నదిలో నీటి కొరతపై బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో ఎండిపోయిన గోదావరి నది ఇసుక తిన్నెలపై సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి సాంప్రదాయ పద్ధతిలో పిండప్రదానం నిర్వహించారు. గోదావరిలో నీటి సమస్య పరిష్కారం కోసం 'గోదావరి కన్నీటి గోస' పేరుతో చేపట్టిన 180 రోజుల పాదయాత్రకు సంవత్సరం పూర్తైనా ప్రభుత్వం స్పందించలేదని నేతలు ఆరోపించారు. ప్రాజెక్టు మరమ్మత్తుల పేరిట ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బతిన్న భాగాలకు తక్షణమే మరమ్మత్తులు చేపడితే గోదావరిలో నీటి నిల్వలు పెరిగి రైతులకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు సాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎండిన గోదావరి తీరాన్ని నిరసన వేదికగా మార్చిన బీఆర్ఎస్ శ్రేణులు గ్రామీణ ఆటపాటలతో వ్యంగ్య నిరసన తెలిపారు. రైతుల సమస్యలను ప్రతిబింబించేలా పాటలు పాడుతూ ప్రజల దృష్టిని ఆకర్షించారు.

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రజలు మురికి నీటినే వినియోగించాల్సిన పరిస్థితి నెలకొందని చందర్ ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి సాగునీటి, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసనలో గోపు ఐలయ్య యాదవ్, మురళీధర్ రావు, తాళ్ల రాజయ్య, తోకల రమేష్, కర్క సుజాత, కృష్ణవేణి, పద్మ, అచ్చ వేణు, బొడ్డుపెల్లి శ్రీనివాస్, మెడి సదానందం, కిరణ్ జీ, రామరాజు, బాలరాజు, దాసరి తదితరులు పాల్గొన్నారు. నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించాయి. గోదావరి ఎండిపోవడం పాలనా వైఫల్యానికి నిదర్శనమని వారు ఆరోపించారు.

## కమాన్‌పూర్‌లో మెగా వైద్య శిబిరం


## ప్రజలకు నిపుణుల సేవలు

**అగ్నిధార న్యూస్ కమాన్‌పూర్‌లి**

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక రెండవ విడతలో భాగంగా కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మార్చి 25, బుధవారం "మెగా వైద్య శిబిరం" నిర్వహించనున్నట్లు కమాన్‌పూర్ మండల వైద్యాధికారి సల్మా బేగం తెలిపారు. ఈ శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులు పాల్గొని ప్రజలకు ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నారు.

ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ (స్త్రీ రోగ నిపుణులు), జనరల్ ఫిజిషియన్, ఆర్థోపెడిక్ (ఎముకల వైద్యుడు), నేత్ర వైద్యుడు, శిశు వైద్యుడు, దంత వైద్యులు అందుబాటులో ఉండి కమాన్‌పూర్ మండలం మరియు పరిసర గ్రామాల ప్రజలకు సమగ్ర వైద్య పరీక్షలు, చికిత్సలు అందించనున్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని సమైక్య సంఘాల మహిళలు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.ఈ వైద్య శిబిరం విజయవంతం కావాలంటే ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేసి తమ గ్రామాల ప్రజలను శిబిరానికి తీసుకురావాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులకు సెలవులు



**నిర్మల్ :** జిల్లాలోని బాసరలో ఉన్న ఆర్జీయూకేటీ -బాసర , పీయూసీ-1, ఇ-1, ఇ-2 విద్యార్థులకు ఆర్జీయూకేటీ అకడమిక్ విభాగం సెలవులను ప్రకటించింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. యూనివర్సిటీలో చదువుతున్న పీయూసీ-1 , ఇ-1 ,ఇ-2 విద్యార్థులకు ఈ నెల 23 నుంచి సెలవులు ప్రకటిస్తున్నట్లు అకడమిక్ అండ్ ప్లానింగ్ అసోసియేట్ డీన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల విద్యా క్యాలెండర్‌కు ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. తరగతులు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని వివరించారు. ?విద్యార్థులు ఈ విరామ సమయాన్ని వృధా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. తదుపరి ఆదేశాల కోసం యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్ లేదా సమాచార మాధ్యమాలలో చూసుకోవాలని సూచించారు.

## బిజినెస్

### ఉద్యోగులకు ఏఐ ట్రైనింగ్.. పియర్సన్‌తో టీసీఎస్ జట్టు




ముంబై: గ్లోబల్ లెర్నింగ్ సర్వీసుల సంస్థ పియర్సన్‌తో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) జట్టు కట్టింది. కృత్రిమ మేథతో సిబ్బందికి శిక్షణనిచ్చి, వారిని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవడంలో కంపెనీలకు తోడ్పాటు అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడనుంది. ఇందుకోసం ఇరు సంస్థలు ఏఐ ఆధారిత లెర్నింగ్ ప్రోడక్టులు, సర్వీసులను రూపొందిస్తాయి. నియామకాల్లో, సిబ్బంది అభివృద్ధి ప్రోగ్రాంలలో అభ్యర్థుల సామర్థ్యాలను మదింపు చేసే ప్రక్రియలో పియర్సన్‌కి చెందిన వెర్సాంట్ ఇంగ్లీష్ ప్రొఫీషియెన్సీ విధానాన్ని టీసీఎస్ ఉపయోగించనుంది. మరోవైపు అంతర్జాతీయ ట్రావెల్ సర్వీసులను డిజిటలీకరించే దిశగా ప్రముఖ ట్రావెల్ టెక్నాలజీ సంస్థ అమెడ్యూస్‌తో టీసీఎస్ చేతులు కలిపింది. మరోవైపు, ఐటీ ఇన్‌ఫ్రా, డేటా సెంటర్లు, ఇతరత్రా టెక్నాలజీల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకునే దిశగా ఆటోమేషన్ దిగ్గజం ఏబీబీ, టీసీఎస్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

### ఇన్‌ఫ్రా స్పీడుకు బ్రేకులు.. పడిపోయిన వృద్ధి



**న్యూఢిల్లీ:** కీలకమైన ఎనిమిది మౌలిక రంగాల గ్రూప్ వృద్ధి ఫిబ్రవరిలో మూడు నెలల కనిష్టానికి నెమ్మదించింది. రిఫైనరీ ఉత్పత్తులు, ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి క్షీణించడంతో 2.3 శాతానికి పరిమితమైంది. గతేడాది ఫిబ్రవరిలో ఇది 3.4 శాతంగా నమోదైంది. కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం తాజాగా ఫిబ్రవరిలో ఎరువులు, సిమెంటు, విద్యుదుత్పత్తి వరుసగా 3.4 శాతం, 9.3 శాతం, 0.5 శాతం మేర క్షీణించింది. అయితే బొగ్గు, ఉక్కు ఉత్పత్తి మాత్రం మెరుగ్గా నమోదైంది. ఇక ఏప్రిల్--ఫిబ్రవరి మధ్యకాలంలో ఇన్‌ఫ్రా వృద్ధి 2.9 శాతానికి పరిమితమైంది. గతేడాది ఇదే వ్యవధిలో 4.4 శాతంగా నమోదైంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు తలెత్తడానికి ముందు నుంచే కీలక రంగాల వృద్ధి నెమ్మదించిందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా చీఫ్ ఎకానమిస్ట్ అదితి నాయర్ తెలిపారు.

# స్మార్ట్‌ఫోన్ - ల్యాప్‌టాప్ ధరల దూకుడు



సెమీకండక్టర్ చిప్‌సెట్ల కొరత రెండేళ్ల క్రితం ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాల తయారీని తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. ఇప్పుడు మెమొరీ చిప్‌ల ధరలు పెరగడం వల్ల స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలు అంతకంతకూ అధికమవుతున్నాయి. డిర్యామ్, నండ్ స్టోరేజీ వ్యయాలు పెరగడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ అంతకంతకూ క్షీణించడం ఈ పరిస్థితికి కారణం. ఫలితంగా గతేడాదితో పోలిస్తే 2026లో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు 13% తగ్గొచ్చని పరిశ్రమ సంఘాలు అంచనా వేస్తున్నాయి.

**ధరల పెరుగుదలకు కారణాలివీ**

ఫోన్, కంప్యూటర్ వంటి పరికరాల్లో డేటాను శాశ్వతంగా భద్రపరచేందుకు వాడే స్టోరేజీ మాడ్యూల్స్ కోసం సెమీకండక్టర్ చిప్స్ కావాలి. వీటి ధరలు ప్రతినెలా పెరుగుతున్నాయి. ముఖ్యంగా 512 జీబీ, 1 టీబీ మాడ్యూల్స్ ధరలు మరింత అధికమవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లలో కీలకమైన డిర్యామ్ (డైనమిక్ ర్యాండమ్ యాక్సెస్ మెమొరీ), స్టోరేజీ మాడ్యూల్/నండ్ ఫ్లాష్‌కు అంతర్జాతీయంగా కొరత ఎక్కువైంది. ఏఐ (కృత్రిమమేధ) డేటా సెంటర్లకు అవసరమైన హైబ్యాండ్‌విడ్త్ మెమొరీ (హెచ్‌బీఎం) వ్యవస్థలకు అంతర్జాతీయంగా ఒక్కసారిగా గిరాకీ పెరగడం ఇందుకు కారణం. మెమొరీచిప్‌లు తయారు చేసే ఎస్‌కే హైనిక్స్, మైక్రాన్ టెక్నాలజీ, శామ్‌సంగ్ వంటివి తాము తయారు చేస్తున్న మెమొరీ కార్డులను డేటా సెంటర్లకే కేటాయిస్తున్నాయి. ఫలితంగా గత నవంబరు నుంచి వీటి ధరలు 50% పెరిగాయని సమాచారం. అందువల్లే స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలు ధరలు పెంచేస్తున్నాయి. ల్యాప్‌టాప్‌ల ధరలు కూడా దాదాపు 20-25% పెరిగాయని, వీటి అమ్మకాలూ నిదానిస్తున్నాయని చెబుతున్నారు.

డాలర్ ప్రభావం

డాలర్ విలువ రూ.93ను మించడం వల్ల, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులన్నీ భారమవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు దేశీయంగా రూపొందుతున్నా, వాటిల్లోని కీలక విడిభాగాలను దిగుమతి చేసుకుని, ఇక్కడ అసెంబ్లింగ్ చేయిస్తున్నారు. ఇందువల్లే వివో, ఓపో, రియల్‌మి, పోకో, శామ్‌సంగ్, వన్‌ప్లస్, మోటరోలా, షియామీ కంపెనీల ఫోన్ల ధరలు 40% వరకు పెరిగాయి.

శామ్‌సంగ్ ప్రీమియం ఫోన్ ఎస్ 26 ధరలను తీసుకుంటే, అదే తరహా ఎస్ 25 కంటే రూ.20,000 ఎక్కువగా ఉంది. 5జీ ఫీచర్ల వల్ల ప్రారంభశ్రేణి స్మార్ట్‌ఫోన్ల ధర రూ.7,500-8000 నుంచి రూ.11,000- 11,500కు చేరింది.

**అమ్మకాలు తగ్గేందుకు..**

స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు తగ్గేందుకు, ధరలు పెరగడంతో పాటు రాయితీలు తగ్గడమూ కారణమని చెబుతున్నారు. ముడిపదార్థాలు, విడిభాగాల ధరలు పెరిగిన నేపథ్యంలో.. ఆన్‌లైన్ పోర్టళ్లు, విక్రయశాలలు కూడా ఫోన్లపై రాయితీలు తగ్గించేశాయి. స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో 60% వరకు రూ.25,000 లోపువే ఉంటాయి. ఈ విభాగ కొనుగోలుదార్లకు ధర-రాయితీ అత్యంత ఆకర్షణీయం. వీటిల్లో ప్రతికూలత వల్ల, కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నారు.

**మారుతున్న కొనుగోలుదార్ల ధోరణి**

కొత్త ఫోన్ల ధరలు పెరగడంతో, ప్రారంభస్థాయి కొనుగోలుదార్లు సెకండ్‌హ్యాండ్ మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నారని ఆలిండియా మొబైల్ రిటెయిలర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కైలాష్ లఖ్యానీ 'ఈనాడు'కు తెలిపారు. ఇందువల్ల సంప్రదాయ విక్రయశాలల్లో స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు ఈ ఏడాది జనవరి - ఫిబ్రవరి మధ్య 35% తగ్గాయని, మార్చిలోనూ నెమ్మదిగానే ఉన్నాయని వివరించారు. యుద్ధ పరిస్థితుల వల్ల, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగితే, ఫోన్లు - ల్యాప్‌టాప్‌ల అమ్మకాలపై మరింత ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు.

## మధుమేహ రోగులకు ఊరట




మధుమేహం, దీర్ఘకాలిక ఊబకాయం (అధిక బరువు) సమస్యలు ఉన్నవారి చికిత్సకు సమర్థంగా ఉపయోగపడే 'సెమాగ్లుటైడ్' ఔషధం సామాన్యులకూ అందుబాటులోకి రానుంది. అంతర్జాతీయంగా 'ఓజెంపిక్', 'విగోవి' వంటి బ్రాండ్ల పేర్లతో ఆదరణ పొందిన ఈ మందు.. శరీరంలో జీఎల్‌పీ-1 హార్మోన్ తరహాలో పనిచేసే ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతుంది. గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది. ఈ బ్రాండ్‌ను ఆవిష్కరించిన నోవో నార్డిస్క్ ఉత్పత్తి చేస్తున్న మందుల ధరలు అధికంగా ఉండటంతో, మనదేశంలో సామాన్యులు వినియోగించడం కష్టంగా ఉంది. ఈ మందుకు సంబంధించిన మాలిక్యూల్ పేటెంట్ గడువు మనదేశంలో ముగిసిన నేపథ్యంలో, డాక్టర్ రెడ్డీస్, గ్లెన్‌మార్క్, జైడస్, టొరెంట్, ఆల్కెమ్, యూఎస్‌వీలాంటి భారతీయ ఫార్మా దిగ్గజాలన్నీ శనివారం తమ జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్లు, ఓరల్ మందులను మార్కెట్లో విడుదల చేశాయి. నాట్కో ఫార్మా శుక్రవారమే విడుదల చేసిన సంగతి విదితమే. బ్రాండెడ్ మందులతో పోలిస్తే బాగా తక్కువ ధరకే ఈ జనరిక్ వెర్షన్లు అందుబాటులోకి వస్తుండటం, సామాన్యులకు ఊరట కలిగించే అంశమే. డాక్టర్ రెడ్డీస్ 'ఒబెడా' పేరుతో ఇంజెక్టబుల్ సెమాగ్లుటైడ్‌ను ప్రవేశపెట్టింది. 2, 4 ఎంజీ మోతాదుల్లో డిస్పోజబుల్ పెన్నుల రూపంలో ఈ మందును తీసుకొచ్చింది. వారానికి ఒకసారి మాత్రమే దీన్ని తీసుకోవాలి. ప్రతి పెన్ ద్వారా కనీసం 4 వారాలకు సరిపడా డోసులు అందుతాయని, నెలకు రూ.4,200 ఖర్చు అవుతుందని సంస్థ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ తెలిపారు.

యూఎస్‌వీ సైతం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ భాగస్వామ్యంతో యూసెమా బ్రాండ్ పేరుతో జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్‌ను భారత్‌లో విడుదల చేసింది.

సన్ ఫార్మా నావెల్‌ట్రీట్, సెమాట్రినిటీ పేర్లతో ఇంజెక్షన్లను విడుదల చేసింది. నావెల్‌ట్రీట్‌ను ఊబకాయ చికిత్సకు ఉపయోగిస్తారు. దీనికి వారానికి రూ.900 - 2,000 వరకు ఖర్చవుతుంది. సెమాట్రినిటీని టైప్-2 మధుమేహ చికిత్సకు ఉపయోగిస్తారు. దీనికి వారానికి రూ.750-1,300 ఖర్చు అవుతుందని కంపెనీ తెలిపింది.

గ్లెన్‌మార్క్ ఫార్మా టైప్-2 మధుమేహం కోసం 'గ్లిపిక్' బ్రాండ్‌ను తీసుకొచ్చింది. వయల్స్ రూపంలో లభించే ఈ మందు కోసం వారానికి రూ.325 - 440 ఖర్చవుతుంది.

జైడస్ లైఫ్‌సైన్సెస్ సెమాగ్లిన్, మాషెమా, ఆల్టర్‌మెట్ పేర్లతో జనరిక్ వెర్షన్లను విడుదల చేసింది. నెలవారీ చికిత్సకు సగటున రూ.2,200 ఖర్చవుతుంది.

## స్పోర్ట్స్

# సౌతాఫ్రికా విజయం.. రసపట్టులో టీ20 సిరీస్!






న్యూజిలాండ్, సౌతాఫ్రికాల మధ్య జరుగుతున్న టీ20 సిరీస్ రసవత్తరంగా మారింది. ఆదివారం వెల్లింగ్టన్ వేదికగ2ఆ జరిగిన నాలుగో టీ20లో దక్షిణాఫ్రికా 19 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. దీంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా 2-2తో రెండు జట్లు సమంగా నిలిచాయి. తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. కొన్నర్ ఎస్తర్‌హూజిన్ (36 బంతుల్లో 57, 7 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్‌గా నిలవవగా, రుబిన్ హెర్మన్ (28 నాటౌట్), టోనీ డి జోర్జి (23) రాణించారు. కివీస్ బౌలర్లలో కైల్ జేమీసన్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 165 పరుగుల లక్ష్యంతో బ?రిలోకి దిగిన న్యూజిలాండ్ 18.5 ఓవర్లలో 145 పరుగులకు ఆలౌటైంది. టిమ్ రాబిన్‌సన్ (22 బంతుల్లో 32) టాప్ స్కోరర్‌గా నిలవగా, డేన్ క్లెవర్ (26) పర్వాలేదనిపించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జీ 3 వికెట్లు పడగొట్టగా, బార్ట్‌మన్, సుబ్రెయన్, కేశవ్ మహరాజ్‌లు తలా రెండు వికెట్లు పడగొట్టారు. అర్థసెంచరీతో మెరిసిన ఎస్తర్‌హూజిన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' గెలుచుకున్నాడు. మ్యాచ్‌లో టాస్ గెలిచిన సౌతాఫ్రికాకు ఆదిలోనే షాక్ తగిలింది. వియాన్ ముల్డర్ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత టోనీ డిజార్జి, ఎస్తర్ హుజిన్‌లు రెండో వికెట్‌కు 81 పరుగులు జోడించి సఫారీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. టోనీ ఔటైన తర్వాత క?ఈజులోకి వచ్చిన రుబిన్ హెర్మన్ ధాటిగా ఆడాడు. ఎస్తర్‌హుజిన్ పెవిలియన్ చేరిన తర్వాత ఇన్నింగ్స్ చివర్లో జాసన్ స్మిత్, డియాన్ ఫెరస్టర్‌లు బ్యాట్ ఝులిపించడంతో సౌతాఫ్రికా గౌరప్రదమైన స్కోరు సాధించింది. అనంతరం ఛేదనలో ఆది నుంచే తడబడిన న్యూజిలాండ్ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. ఇరుజట్ల మధ్య నిర్ణయాత్మక చివరి టీ20 బుధవారం జరగనుంది.

### నాలుగో టీ20లో సౌతాఫ్రికా చిత్తు.. సిరీస్ న్యూజిలాండ్ సొంతం



వెల్లింగ్టన్ వేదికగా దక్షిణాఫ్రికాతో మహిళలతో జరిగిన నాలుగో టీ20లో న్యూజిలాండ్ ఉమెన్స్ టీమ్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-1తో న్యూజిలాండ్ సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ప్రోటీస్ ఆల్‌రౌండర్ అనేరీ డెర్క్సెన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడింది. కేవలం 32 బంతుల్లో 8 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 55 పరుగులు చేసింది. ఆమెతో పాటు లాస్ 30 పరుగులతో రాణించింది. న్యూజిలాండ్ బౌలర్లలో జెస్ కెర్ 3 వికెట్లతో అదరగొట్టింది. అనంతరం 160 పరుగుల లక్ష్యాన్ని కివీస్ జట్టు 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కివీస్ స్టార్ ఆల్‌రౌండర్ సోఫీ డివైన్ మరోసారి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడింది. కేవలం 34 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 64 పరుగులు చేసింది. ఆమెతో పాటు అమీలియా కేర్ 31 పరుగులతో రాణించింది. సౌతాఫ్రికా బౌలర్లలో క్లో ట్రయాన్ 2 వికెట్లు తీసింది. ఇక ఇరు జట్ల మధ్య నామమాత్రపు ఐదో టీ20 క్రైస్ట్‌చర్చ్ వేదికగా మార్చి 25న జరగనుంది.

### 250 స్కోర్ కొట్టినా.. సన్‌రైజర్స్ ఓడిపోతుంది'




ఐపీఎల్-2026 సీజన్ కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటుంది. గత సీజన్‌లో కనీసం ప్లే ఆఫ్స్ చేరకుండానే ఇంటిముఖం పట్టిన ఎస్‌ఆర్‌హెచ్.. ఈసారి మాత్రం ఛాంపియన్‌గా నిలవాలనే పట్టుదలతో ఉంది. ఇప్పటికే ఆరెం?జ్ ఆర్మీ తమ హోం గ్రౌండ్‌లో ప్రాక్టీస్‌ను మొదలు పెట్టింది. అయితే ఈ ఏడాది సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ దూరం కావడం ఎస్‌ఆర్‌హెచ్‌కు గట్టి ఎదురు దెబ్బ అనే చెప్పాలి. వెన్ను గాయంతో బాధపడుతున్న కమ్మిన్స్ సీజన్ మధ్యలో ఎస్‌ఆర్‌హెచ్ జట్టులో చేరే అవకాశముంది. దీంతో అప్పటివరకు సన్‌రైజర్స్ జట్టును స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ నడిపించనున్నాడు. మరోవైపు గత సీజన్‌లో దుమ్ములేపిన శ్రీలంక పేసర్ ఎషాన్ మలింగ అందుబాటుపై కూడా సందిగ్ధం నెలకొం?ది. అంతేకాకుండా వేలంలో కొన్న బౌలింగ్ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ కూడా గాయం కారణంగా టోర్నీ నుంచి తప్పుకొన్నాడు. దీంతో ఈ ఏడాది సీజన్‌లో ఎస్‌ఆర్‌హెచ్‌ను బౌలింగ్ కష్టాలు వెంటాడడం ఖాయం. ఎందుకంటే ప్రస్తుత ఎస్‌ఆర్‌హెచ్ జట్టులో హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కట్ తప్ప చెప్పుకోదగ్గ ఫాస్ట్ బౌలర్ అంటూ లేరు. ఇదే విషయంపై భారత మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈ ఏడాది సీజన్‌లో ఎస్‌ఆర్‌హెచ్‌కు బౌలింగ్ అతి పెద్ద సవాలుగా మారనుందని అతడు అభిప్రాయపడ్డాడు. "కమ్మిన్స్, మలింగ లేకపోవడంతో ఎస్‌ఆర్‌హెచ్ బౌలింగ్ విభాగం చాలా వీక్‌గా కన్పిస్తోంది. కచ్చితంగా సవాళ్లు ఎదురవుతాయి. బ్రైడన్ కార్స్ జట్టులో ఉన్నప్పటికి ఉపఖండ పిచ్‌లపై అతడికి అనుభవం లేదు. అలా అని కేవలం భారత బౌలర్లతో ఆడడం చాలా ప్రమాదకరం. జట్టులో అమిత్ కుమార్, ప్రఫుల్ హింజ్, సాకిబ్ హుస్సేన్, ఓంకర్ తర్మాలే, జీషన్ అన్సారీ, శివాంగ్ కుమార్ హర్ష్ దూబే వంటి యువ బౌలర్లు ఉన్నారు. హర్షల్ పటేల్, జయదేవ్ ఉనద్కట్‌కు మాత్రమే ఎక్కువ ఆడిన అనుభవం ఉంది. ఈ బలహీనమైన బౌలింగ్ లైనప్‌తో ఎస్‌ఆర్‌హెచ్ ఎలా మేనెజ్‌చేస్తోందో అర్థం కావడం లేదు. ఒకవేళ బ్యాటర్లు 250 పరుగులు చేసినా, బౌలర్లు ఆ టోటల్‌ను డిఫెండ్ చేసుకునేలా లేరు" అని చోప్రా తన యూట్యూబ్ ఛానల్‌లలో పేర్కొన్నాడు.

# ‘పెద్ది’ ఐటెం సాంగ్‌లో మృణాల్ ఠాకూర్.. రామ్ చరణ్‌తో స్పెషల్ డ్యాన్స్‌కు సిద్ధమా?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘పెద్ది’పై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మిగిలి ఉన్న కీలక అంశాల్లో ఒకటైన ఐటెం సాంగ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. దర్శకుడు బుచ్చిబాబు సన స్పెషల్ సాంగ్ కోసం సరైన హీరోయిన్ ఎంపికపై కొంతకాలంగా తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. మొదట ఈ పాటలో ముగ్గురు లేదా నలుగురు హీరోయిన్లను తీసుకోవాలనే ఆలోచన ఉన్నప్పటికీ, సమయం తక్కువగా ఉండటంతో ఆ ప్లాన్‌ను విరమించుకున్నట్లు సమాచారం. తాజాగా ఈ స్పెషల్ సాంగ్‌లో రామ్ చరణ్ సరసన నటించేందుకు మృణాల్ ఠాకూర్‌ని ఎంపిక చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వాస్తవానికి ఈ వార్త కొద్దిరోజుల క్రితమే వినిపించినా, అధికారికంగా ఎలాంటి క్లారిటీ లేదు. అయితే ఇటీవల మృణాల్ ఠాకూర్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు, ఆమె హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలియజేసే పోస్టులు ఈ వార్తలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. ఆమె ‘పెద్ది’ పాట షూట్ కోసమే నగరానికి వచ్చినట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఇక మృణాల్ ప్రస్తుతం అడివి శేష్‌తో కలిసి నటిస్తున్న ‘డెకాయిట్’ సినిమా ప్రమోషన్లతో కూడా బిజీగా ఉన్నారు. ఏప్రిల్ 10న విడుదల కానున్న ఈ చిత్రం కోసం ఆమె డేట్లను టీమ్ ప్రత్యేకంగా ప్లాన్ చేసింది. ఈ ప్రమోషన్ల మధ్యలో లభించే గ్యాప్‌లోనే ‘పెద్ది’ ఐటెం సాంగ్ షూట్ పూర్తి చేయాలని యూనిట్ భావిస్తోంది.వీశీజఅవం మరో ఆసక్తికర విషయం ఏమిటంటే, ఈ పాటలో మృణాల్ ఠాకూర్‌తో పాటు జాన్వీ కపూర్ కూడా కనిపించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమా నుంచి టీజర్ లేదా ట్రైలర్ రూపంలో స్పెషల్ అప్డేట్ ఇవ్వొచ్చని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇదిలా ఉండగా, ‘పెద్ది’ సినిమా వాయిదా పడుతుందనే ప్రచారాలకు చిత్రబృందం ఇప్పటికే చెక్ పెట్టింది.

# అల్లు అర్జున్- అట్లీ సినిమాలో అనుష్క



ఐకాన్ స్టార్ అ?ల్లు అర్జున్- అట్లీ ప్రాజెక్ట్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాతోనే ఆమె టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనుందని ప్రచారం జరుగుతుంది. పుష్ప-2 తర్వాత బాలీవుడ్‌లో అల్లు అర్జున్‌కు భారీ క్రేజ్ ఏర్పడింది. దీంతో తను నటించబోయే సినిమాల్లో హిందీ హీరోయిన్లనే ఎంపిక చేస్తున్నట్లు టాక్. ఇప్పటికే అట్లీ సినిమా కోసం దీపికా పదుకోణ్‌ను తీసుకున్నారు. లోకేశ్ కనగరాజ్ మూవీ కోసం శ్రద్ధా కపూర్ పేరు పరిశీలనలో ఉంది. ఇంతలోనే మరో క్రేజ్ హీరోయిన్ పేరు తెరపైకి రావడం విశేషం. అల్లు అర్జున్- అట్లీ మూవీ కోసం అనుష్క శర్మను తీసుకోనున్నట్లు బాలీవుడ్‌లో కథనాలు వస్తున్నాయి. దీనిపై ఇంకా అధికారిక ధృవీకరణ లేదు. కానీ, ఈ వార్త వైరల్ అవుతుంది. ఒకవేళ ఇది నిజమైతే, అనుష్క ఈ చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేయనున్నారు. క్రికెటర్ కోహ్లితో వివాహం తర్వాత అనుష్క కాస్త సినిమాలు తగ్గించిన విషయం తెలిసిందే. అయితే, అల్లు అర్జున్‌తో సినిమా కావడంతో ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సమాచారం. చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మిస్తుండగా, సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఈ సైన్స్‌ఫిక్షన్ మూవీలో హీరో పాత్ర మూడు విభిన్న కోణాల్లో సాగుతుందని టాక్. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ, విజువల్ ఎఫెక్ట్స్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ చిత్రంలో మరో ఇద్దరు హీరోయిన్లకు అవకాశం ఉందని మొదటి నుంచి ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ దీపికా పదుకొణ్‌తో పాటు అనుష్క శర్మ ఎంట్రీ ఇస్తే ఇదో సంచలనంగా మారడం ఖాయం.

# పెళ్లి తర్వాత కెరీర్ ముగియదు.. ఫ్యాషన్ వీక్‌లో షోస్టాపర్‌గా మెరిసిన మిసెస్ యూనివర్స్ షెర్రీ!



అంతర్జాతీయ వేదికపై భారతీయ కీర్తి పతాకాన్ని ఎగురవేసిన మిసెస్ యూనివర్స్ 2025 షెర్రీ సింగ్, మరోసారి వార్తల్లో నిలిచింది. తాజాగా ముంబైలో జరిగిన ‘లక్మే ఫ్యాషన్ వీక్ 2026’ రెండవ రోజున ఆమె తన అద్భుతమైన ర్యాంప్ వాక్‌తో అందరినీ ఆశ్చర్యపరిచారు. 35 ఏళ్ల వయసులో కూడా తనలోని అజేయమైన శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తూ, వివాహం మరియు వయసుపై సమాజంలో పాతుకుపోయిన మూస ధోరణులను ఆమె సవాలు చేశారు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ పవన్ సచ్‌దేవా రూపొందించిన ప్రత్యేకమైన ‘ఖాదీ డెనిమ్’ దుస్తుల్లో షెర్రీ సింగ్ షోస్టాపర్‌గా మెరిశారు. ఒక ట్రెంచ్ కోట్, బాంబర్ జాకెట్, స్కర్ట్ మరియు క్రిస్ప్ షర్ట్‌తో కూడిన ఈ కాంబినేషన్ అటు సౌకర్యాన్ని, ఇటు ఫ్యాషన్‌ను అద్భుతంగా ప్రతిబింబించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. “ఫ్యాషన్ అనేది కేవలం అందంగా కనిపించడం మాత్రమే కాదు, అది నా భావాలను వ్యక్తీకరించే ఒక మాధ్యమం. ఇది నాకు ఒక ప్రేమ భాష వంటిది. మీ కథను మళ్ళీ రాసుకోవడానికి వయసుతో సంబంధం లేదు. కలలను నిజం చేసుకోవడానికి ఎప్పుడూ ఆలస్యం కాదు. మీరు చేయాల్సిందల్లా ఆ అడుగు వేసే ధైర్యం చేయడం మాత్రమే అని షెర్రీ చెప్పుకొచ్చింది. ఇక షెర్రీ సింగ్ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమైనది. గత ఏడాది ఫిలిప్పీన్స్‌లో జరిగిన మిసెస్ యూనివర్స్ పోటీల్లో 120కి పైగా దేశాల ప్రతినిధులను వెనక్కి నెట్టి, దాదాపు 48 ఏళ్ల తర్వాత ఈ కిరీటాన్ని గెలుచుకున్న మొదటి భారతీయురాలిగా ఆమె చరిత్ర సృష్టించారు.

# బర్త్‌డే పార్టీకీ లంగా ఓణితో వెళ్లలేం కదా.. మహిళల డ్రెస్సింగ్‌పై నిహారిక కామెంట్స్



మహిళల వస్త్రధారణ పై నిహారిక ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఎలాంటి దుస్తులు ధరించాలనేది వారిష్టం కానీ, సమాజాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని మెలగాలని ఆమె అన్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మహిళల వస్త్రధారణ గురించి మాట్లాడుతూ.. ‘నా వరకు అయితే నాలుగు గోడల మధ్య ఉన్నప్పుడు ఇష్టం వచ్చిన దుస్తులు ధరించొచ్చు. కానీ బయటకు వచ్చిన తర్వాత మనం సొసైటీతో ఎన్నో రిలేషన్స్ పెట్టుకొని ఉంటాం, వాటికి అనుగుణంగానే వస్త్రధారణ ఉండాలి. నేను ఏదైనా ఒక పెళ్లికి వెళితే కచ్చితంగా చీర కట్టుకొనే వెళ్తాను. అలాగే నా ఫ్రెండ్ బర్త్‌డే పార్టీకి వెళితే లంగా ఓణి వేసుకొని వెళ్లలేను కదా? అలా వెళ్తే.. అందరూ కింది నుంచి పైవరకు అలా చూస్తారు(నవ్వుతూ..). మనం వెళ్లే సందర్భాన్ని బట్టి దుస్తులు ఉండాలి. టీనేజ్ లో ఉన్నప్పుడు మన పేరెంట్స్ ఇలాంటి డ్రెస్ వేసుకొద్దు.. అలా రెడీ కావాలని చెబుతుంటారు. అది మనకు కండీషన్లు పెట్టినట్లు కాదు..బయట సమాజం గురించి తెలియదు కాబట్టే వాళ్లు ప్రొటెక్ట్ చేస్తున్నారనీ అర్థం. నాక్కూడా నాన్న అలాంటి సలహా ఇచ్చేవారు. అమ్మ కూడా ‘ఇది నీకు సెట్ అవ్వలేదు..అది వేసుకో బాగుంటుంది’ అని చెప్పేది. అందులో తప్పేం లేదు. టీనేజ్ దాటిన తర్వాత కూడా అలాంటి కండీషన్లు పెట్టడం కరెక్ట్ కాదు. వాళ్లకు తెలుసు. ఏ డ్రెస్ వేసుకుంటే.. ఎలాంటి కామెంట్స్ చేస్తారో. మనం సమాజంలో తిరుగుతున్నాం కాబట్టి ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని దుస్తులు ధరించాలి’ అని నిహారిక చెప్పుకొచ్చింది. నిహారిక కెరీర్ విషయానికొస్తే.. నటనకు కాస్త బ్రేక్ ఇచ్చి.. నిర్మాణ సంస్థపై ఫోకస్ చేసింది. తన బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై వరుస సినిమాలు నిర్మించేందుకు రెడీ అవుతోంది. తాజాగా రాకాస అనే హర్రర్ కామెడీ చిత్రాన్ని నిర్మించింది.

# ఒకటి అలా.. మరొకటి ఇలా.. ఈసారి ఏమవుతుందో?



గతంలో పవన్ కల్యాణ్ వరస ఫ్లాప్ సినిమాలతో ఇబ్బంది పడుతున్నప్పుడు ‘దబంగ్’ని రీమేక్ చేసి ‘గబ్బర్ సింగ్’ తీసిన దర్శకుడు హరీశ్ శంకర్ హిట్ కొట్టాడు. ఇది 2011లో జరిగింది. మూవీలో కంటెంట్‌తో పాటు ఎంటర్‌టైన్‌మెంట్ ఉండేసరికి ప్రేక్షకులు ఆదరించారు. దాదాపు అదే టెంప్లేట్‌తో తీసిన ‘ఉస్తాద్ భగత్ సింగ్’ రీసెంట్‌గా థియేటర్లలోకి వచ్చింది. పవన్ అభిమానుల కోసం దీన్నే తీశానని హరీశ్ శంకర్ మొదటి నుంచి చెబుతూ వచ్చాడు. అందుకు తగ్గట్లే ఫ్యాన్స్‌కి తప్పితే సగటు ఆడియెన్స్‌కి నచ్చలేదు. బుకింగ్సే అందుకు నిదర్శనం.

ఇప్పుడు పవన్‌తో మరో సినిమా తీస్తానని హరీశ్ శంకర్ అంటున్నాడు. ఈసారి స్టోరీ కొత్తగా ఉంటుందని, అందరికీ నచ్చేలా తీస్తానని అంటున్నాడు. అయితే ఈ దర్శకుడు మూవీ చేస్తానని అనడం బాగానే ఉంది గానీ పవన్ ఒప్పుకొన్నాడా లేదా అనేది మాత్రం చెప్పలేదు. ప్రస్తుతం పవన్ చేతిలో సురేందర్ రెడ్డి మూవీ, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో ఒప్పుకొన్న ప్రాజెక్ట్స్ ఉన్నాయి. వీటి తర్వాత మూవీస్ చేస్తాడా అనేది సందేహమే. హరీశ్ శంకర్ ట్రాక్ రికార్డ్ చూస్తే.. అప్పుడెప్పుడో వచ్చిన ‘గబ్బర్ సింగ్’ హిట్ అయింది. తర్వాత చేసిన వాటిలో దువ్వాడ జగన్నాథం, సుబ్రమణ్యం ఫర్ సేల్ ఉన్నంతలో ఆకట్టుకున్నాయి. గద్దలకొండ గణేశ్, మిస్టర్ బచ్చన్ లాంటి రీమేక్స్ అయితే బాక్సాఫీస్ దగ్గర ఏ మాత్రం మెప్పించలేకపోయాయి. ఇప్పుడు తీసిన ‘ఉస్తాద్..’ ప్రకటించి, పూర్తి చేసి రిలీజ్ చేయడానికే ఐదేళ్లు పట్టేసింది. ఇప్పుడు మరో సినిమా అంటే అయ్యే పనేనా అని మాట్లాడుకుంటున్నారు. ఒకవేళ పవన్ ఒప్పుకొన్న ప్రొడ్యూసర్ ఎవరనేది చూడాలి?

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com